


ఆర్థిక ఉగ్రవాదులను రప్పించడంలో మోదీ విఫలం

» ప్రజల సంపదను దోచుకుని విదేశాలకు వెళ్లిపోయిన 29 మందిలో 28 మంది గుజరాతీకు చెందినవారే... ... మెయిన్‌లో

» సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



దళారులుగా మార్కెటింగ్ శాఖాధికారులు

అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో టమాటా కొని విశాఖ రైతుబజార్లలో విక్రయం

మూడు నెలలుగా ఇదే తంతు



రైతుబజార్‌లో టమాటా విక్రయాలు

- ప్రస్తుతం వీధుల్లో కిలో రూ.14కు విక్రయం
- రైతుబజార్లలో రూ.16!
- అన్ని రకాల కూరగాయలను అదే విధంగా ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి ఇక్కడ అమ్మించేందుకు ప్లాన్
- నష్టపోతున్నామని రైతులు చెబుతున్నా పట్టించుకోని వైనం

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు కొందరు కమీషన్లకు ఆశపడి దళారులుగా మారుతున్నారు. రైతుబజార్ల లక్ష్యం దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు. టమాటా విస్తృతంగా పండడంతో మూడు నెలల క్రితం రైతుకు గిట్టుబాటు ధర లభించలేదు. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో రైతులు టమాటాను పారబోస్తున్నారని వార్తలు రావడంతో ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి ముందుకువచ్చింది. వారి దగ్గర టమాటా కొని ఎక్కువ వినియోగం ఉన్న జిల్లాల్లో విక్రయించేలా చర్యలు చేపట్టింది. ఆ క్రమంలోనే విశాఖపట్నంలో రైతుబజార్ల ద్వారా ఆ టమాటా విక్రయానికి శ్రీకారం చుట్టారు. విశాఖ వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి, రవాణా చార్జీలు కలుపుకొని ఇక్కడ రైతుబజార్లలో రైతుల ద్వారా అమ్మించసాగారు.

విశాఖ రైతుబజార్లకు రోజుకు 30 టన్నుల టమాటా అవసరం. రైతుల పంట కాకుండా అదనంగా అవసరమైన టమాటాను డ్వాక్రా సంఘాలు జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో కొని రెండు రూపాయల లాభం వేసుకుని రైతుబజార్లలో విక్రయిస్తుంటాయి. ఈ విధానం కొన్ని సంవత్సరాలుగా నడుస్తోంది. అయితే మార్కెటింగ్ అధికారులు టమాటా బయట నుంచి తెప్పించడం వల్ల డ్వాక్రా గ్రూపులు హోల్‌సేల్‌లో కొనకూడదని ఆంక్షలు పెట్టారు. తాము తెప్పించిన సరుకే విక్రయించాలని నిబంధన పెట్టారు. ఇంతవరకూ బాగానే ఉంది. గత నెల రోజులుగా ఆయా జిల్లాల్లోనే టమాటా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. అయినా అధికారులు అక్కడ కొని, ఇక్కడ అమ్మడం ఆపలేదు. ఈ వ్యవహారంలో వారికి కిలోకు రెండు నుంచి మూడు రూపాయల వరకు గిట్టుబాటు అవుతోందని సమాచారం. రోజుకు 30 టన్నులు కొంటున్నారు. అక్కడ రైతులకు ఎంత ఇస్తున్నారో ఎవరికీ తెలియదు. ఇక్కడ మాత్రం రేటు రూ.15కి తక్కువ లేకుండా అమ్ముతున్నారు. ఈ విధానం లాభదాయకంగా ఉండడంతో ఇకపై మిగిలిన కూరగాయలు కూడా అదే విధానంలో తెప్పించి రైతులకు సరఫరా చేయాలని ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్టు తెలిసింది. శుక్రవారం నగరంలో ఆటోల్లో టమాటా తీసుకువచ్చి వీధుల్లో వంద రూపాయలకు ఏడు కిలోలు చొప్పున విక్రయించారు. అంటే కిలో రూ.14 పడింది. రైతుబజార్లలో మాత్రం కిలో రూ.16 చొప్పున విక్రయించారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళితే...ఈ మూడు నెలలూ టమాటా

... మిగతా 6వ పేజీలో



జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

జిల్లాలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రీన్ పార్కు రోడ్డులోని ఆయన విగ్రహానికి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు.

కేజీహెచ్‌లో మందుల కొరత

- అవుట్ పేషెంట్‌లకు వారానికే మందులు
- అంతకు మించి ఇవ్వవద్దని ఆదేశాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జి ఆస్పత్రిలో మందుల కొరత ఏర్పడింది. మధుమేహం, రక్తపోటు, నరాల సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలతో వస్తున్న అవుట్ పేషెంట్‌లకు నెలకు సరిపడా మందులు ఇవ్వడం లేదు. నెల రోజుల కిందటి వరకూ రెండు వారాలకు, పది రోజులకు సరిపడా ఇచ్చేవారు. ఇప్పుడు మరీ కష్టం కావడంతో సూపరింటెండెంట్ శుక్రవారం ప్రత్యేక సర్క్యులర్ జారీచేశారు. అవుట్ పేషెంట్ విభాగంలో విధులు నిర్వహించే ఫ్యాకల్టీ, సీనియర్ రెసిడెంట్ వైద్యులు, పీజీ వైద్యులు, హౌస్ సర్జన్ చేస్తున్న వైద్యులు ఇకపై అంటే శనివారం నుంచి ఒక్క వారానికి మాత్రమే రోగులకు మందులు రాయాలని ఆదేశించారు. అంటే ఇకపై రోగులు మందుల కోసం ప్రతి వారం కేజీహెచ్‌కు రావలసి ఉంటుంది. ఇది పెద్ద సమస్య. దీనిపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కేజీహెచ్‌కు పూర్తిస్థాయిలో మందులు అందేలా చూడాల్సి ఉంది.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

562 నుంచి 568కు పెంపు

- 28 ఫౌండేషన్ పాఠశాలలు
- 242 బేసిక్ ప్రాథమిక పాఠశాలలు
- 186 ఆదర్శ పాఠశాలలు
- 20 యూపీ పాఠశాలలు
- 92 ఉన్నత పాఠశాలలు
- 11 గ్రామాల్లో హైస్కూళ్లలోనే బేసిక్ ప్రాథమిక పాఠశాలలు
- పూర్తయిన విద్యా శాఖ కసరత్తు



ఆదర్శపాఠశాలగా మారబోతున్న ఆరిలోవ ప్రాథమిక పాఠశాల

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తయ్యింది. ప్రస్తుతం 562 స్కూళ్లు (86 ఉన్నత, 29 ప్రాథమికోన్నత, 453 ప్రాథమిక పాఠశాలలు) ఉండగా, కొత్త విధానంలో 568 (28 ఫౌండేషన్ పాఠశాలలు, 242 బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 186 ఆదర్శ పాఠశాలలు, 20 యూపీ పాఠశాలలు, 92 ఉన్నత పాఠశాలలు) కానున్నాయి. ఉన్నత పాఠశాలల సంఖ్య 92కు చేరనుండగా, యూపీ పాఠశాలల సంఖ్య ఇరవైకి తగ్గనున్నది. అలాగే ప్రతి పంచాయతీ/వార్డులో ఒకటి అంతకంటే ఎక్కువ ఆదర్శ పాఠశాలలు ఏర్పాటుకానున్నాయి. ఈ మేరకు విద్యా శాఖ కసరత్తు పూర్తిచేసింది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం అమలులోకి వస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత జిల్లాలో 28 ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్పుచేశారు. ఇక్కడ పూర్వ ప్రాథమిక విద్య (ఎల్‌కేజీ, యూకేజీ), ఒకటి, రెండు తరగతులు ఉంటాయి. 30 మంది వరకూ ఒకరే ఉపాధ్యాయుడు ఉంటారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాన్ని ఫౌండేషన్ స్కూలులో విలీనం చేస్తే అంగన్‌వాడీ టీచర్ సేవలు తీసుకుంటారు. ఇంకా 242 బేసిక్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు నిర్ణయించారు. బేసిక్ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ బోధన చేస్తారు. ఈ పాఠశాలల్లో 20 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు, అంతకు మించి ఉంటే రెండో ఉపాధ్యాయుడిని నియమిస్తారు.

ఇక పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో కీలకమైనవిగా పేర్కొంటున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు 186 ఏర్పాటుకానున్నాయి. కనీసం 60 మంది విద్యార్థులు ఉండాలన్న నిబంధనను సడలించి 45 మంది ఉన్నా పరిగణనలోకి తీసుకోవాలని యాజమాన్య కమిటీలు కోరాయి. ముందుగా ప్రతి పంచాయతీ/వార్డుకు ఒక ఆదర్శ పాఠశాల ఏర్పాటుచేయాలని భావించారు. జిల్లాలో 79 గ్రామ పంచాయతీలు, జీవీఎంసీలో 98 వార్డులు ఉన్నాయి. దీని ప్రకారం 177 పాఠశాలలు రావాలి గాని నగర పరిధిలో కొన్ని వార్డుల్లో రెండేసి ఆదర్శ పాఠశాలలను ఏర్పాటుచేయనున్నారు. అయితే 45 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న కొన్ని పంచాయతీలల్లో మాత్రం ఏర్పాటుచేయడం వీలుకాలేదు. ఆదర్శ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బోధన చేస్తారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారు. జిల్లాలో ఇప్పటివరకూ 29 యూపీ పాఠశాలలు ఉండగా వాటి సంఖ్య 20కు కుదించారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో నిబంధనల ప్రకారం యూపీ పాఠశాలలను రద్దుచేయాలి. ఎక్కడైనా ఉన్నత పాఠశాలలకు దూరంగా ఉంటే మాత్రమే

... మిగతా 6వ పేజీలో

యథేచ్ఛగా ఆహార పదార్థాల కల్తీ

జిల్లా ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారుల తనిఖీల్లో గుర్తింపు



హోటల్‌లో పదార్థాలు

- గడిచిన ఆరు నెలల్లో 218 నమూనాలు సేకరించి పరీక్షల నిర్వహణ
- తొమ్మిది హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రమాదకరమైన కలర్స్ వినియోగం
- అవి కలిసిన ఆహారం తీసుకుంటే అజీర్తి, కడుపులో వికారం, వాంతులు, ఎసిడిటీ వంటి ఇబ్బందులు
- మరో 22 నమూనాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించినట్టు నిర్ధారణ
- మరో 31 నమూనాల్లో కల్తీ

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార పదార్థాల తయారీలో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలను వినియోగిస్తున్నట్టు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారుల తనిఖీల్లో తేలింది.



పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారి(ఫైల్)

గత ఏడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకూ హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు నిత్యావసర సరకులను విక్రయించే దుకాణాల నుంచి 218 నమూనాలను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. అందులో తొమ్మిది నమూనాల్లో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు ఉన్నట్టు తేలింది. టార్ట్రాజినా, సన్‌సెట్ ఎల్లో వంటి కలర్స్ ఉన్నట్టు గుర్తించడం జరిగింది. ఆ కలర్స్ వినియోగించిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల అజీర్తి, కడుపులో వికారం, వాంతులు, ఎసిడిటీ వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. చిన్నారులు దీర్ఘకాలంలో ఇతర అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. కలర్స్ కలిపిన ఆహార పదార్థాలను కూల్ చేసి మళ్లీ రీహీట్ చేయడం వల్ల విషతుల్యమవుతాయని చెబుతున్నారు. ఈ తొమ్మిది నమూనాలకు సంబంధించిన హోటళ్లు, రెస్టారెంట్లపై అధికారులు

... మిగతా 6వ పేజీలో

ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా 2047 విజన్ ప్రణాళికలు



- నియోజకవర్గాల రూపురేఖలు మారాలి
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా 2047 విజన్ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. కెపాసిటీ బిల్డింగ్‌పై శుక్రవారం నగరంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధికారులకు నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక అమలుకు అనుగుణంగా తాత్కాలిక వార్షిక ప్రణాళికలు తయారుచేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల రూపురేఖలు మార్చే విధంగా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ రంగాలుగా గుర్తించిన వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. మే 15వ తేదీకల్లా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. విజన్ ప్రణాళిక అమలు కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, నియోజకవర్గ కమిటీలకు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా, ఆయా జోనల్, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు కన్వీనర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఒక్కొక్క కమిటీలో ఐదుగురు సచివాలయ సిబ్బంది ఉంటారన్నారు. వర్క్‌షాపులో రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి, పలువురు డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

కర్నూలు, బెంగళూరు, తిరుపతికి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ నుంచి కర్నూలు, బెంగళూరు, తిరుపతికి ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-కర్నూలు సిటీ-విశాఖ: 08545 నంబరు గల రైలు ఈనెల 15 నుంచి వచ్చే నెల 27 వరకు ప్రతి మంగళవారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు

... మిగతా 6వ పేజీలో

15 నుంచి నెలాఖరు వరకూ

ఉక్కు ఉద్యోగులకు సెలవులు కట్

- కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె నేపథ్యంలో చీఫ్ జనరల్ మేనేజర్ (వర్క్స్) ఉత్తర్వులు



విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ఈ నెల 15వ తేదీ నుంచి నెలాఖరు వరకు ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్టు చీఫ్ జనరల్ మేనేజర్ (వర్క్స్) శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి ఒక్కరూ విధుల్లో ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించాల్సిన అవసరం ఉన్నందున ఈ ఆదేశాలు ఇచ్చామన్నారు. తీవ్ర అనారోగ్య పరిస్థితులుఉంటే తప్ప ఎవరికీ సెలవు ఇవ్వబోమని అందులో పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమ్మె నేపథ్యంలోనే...

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య తగ్గించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోంది. ఇటీవలె 1,500 మందిని నిలిపివేసింది. కాంట్రాక్టులను రెన్యువల్ చేయకుండా పరోక్షంగా కార్మికుల ఉపాధి అవకాశాలు దెబ్బతీస్తోంది. ఈ చర్యలను నిరసిస్తూ కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు.ప్లాంటులో సుమారు 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. వారంతా సమ్మెలో పాల్గొంటే అనేక విభాగాల్లో కీలకమైన పనులు ఆగిపోతాయి. అలాంటి పరిస్థితి రాకూడదనే శాశ్వత ఉద్యోగులు పది వేల మంది సెలవు పెట్టకుండా విధులకు రావాలని సీజీఎం ఆర్డర్ వేశారు. సమ్మె వల్ల ఉత్పత్తిపై ప్రభావం పడకూడదని, ఎప్పటిలాగే రెండు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా పూర్తి ఉత్పత్తి తీయాలని ఆయన చెబుతున్నారు. కార్మికుల సమ్మె వల్ల ప్లాంటు ఉత్పత్తిపై ఎటువంటి ప్రభావం లేదని చెప్పడానికి యాజమాన్యం ఈ తరహా నిర్ణయాలు తీసుకొని, ఉద్యోగులపై ఒత్తిడి పెడుతోంది. దీనిపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే యాజమాన్యం చెప్పిన మాట వినకపోతే తప్పనిసరి రిటైర్‌మెంట్ నోటీసుతో ఇంటికి పంపించేందుకు సిద్ధమైంది. ఆ భయంతో ఎవరూ నోరెత్తలేకపోతున్నారు. ఈ నిర్ణయాల వల్ల ఎటువంటి దుష్పరిణామాలు సంభవిస్తాయోనని అంతా భయపడుతున్నారు.

అప్పన్న కల్యాణోత్సవాల్లో నేటి కార్యక్రమాలు

సింహాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జరుగుతున్న వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం వేకువజామున 3.00 గంటలకు సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు, విశేష హోమాలు, బాలభోగం నివేదన, గ్రామ బలిహరణ చేయనున్నారు. ఉదయం 6.30 నుంచి 8.00 వరకు పూర్ణాహుతి, మంగళాశాసనం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, తిరువీధి, అవబృధోత్సవం జరుగుతాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు భక్తులకు సర్వ దర్శనాలు కల్పిస్తారు.మధ్యాహ్నం 11.30 నుంచి 12.30 వరకు రాజభోగం (మహానివేదన). ఈ సమయంలో భక్తులకు దర్శనాలు నిలిపివేస్తారు. రాత్రి 7 నుంచి 11.00 వరకు ఆరాధన, నివేదన, మృగయోత్సవం, (అశ్వ వాహనంపై తిరువీధి), దొంగల దోపు ఉత్సవం, ధ్వజావరోహణం, సంవాద సేవ ఉంటుంది. అనంతరం పవళింపు, కవాట బంధనం చేస్తారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపు కేంద్రాలు

కొమ్మాది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జోన్ 2 పరిధిలోని పన్ను చెల్లింపు కేంద్రాలు ఆదివారం, ఇతర సెలవు రోజుల్లోనూ పని చేస్తాయని జడ్సీ కనక మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సెలవు రోజుల్లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ఈవిధంగానే పనిచేస్తాయని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

సాగర్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో కొలువై వున్న శ్రీ దుర్గ, శ్రీ సరస్వతి సమేత మొగధారమ్మ, మహాలక్ష్మీ పద్మాలయం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.వేకువజాము నుంచి ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం హోమాలు, శ్రీపుష్పయాగం చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సూరపనేని లక్ష్మీప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

నేడు హనుమాన్ బైక్ ర్యాలీ

ఆనందపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఆనందపురం నుంచి ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం వరకు శనివారం భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు హనుమాన్ విజయో త్సవ కమిటీ ప్రతినిధి తమ్మిన నరసింగరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2. 30 గంటలకు ఆనందపురం గాయత్రి డిగ్రీ కళాశాల మైదానం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. పూల మార్కెట్, మధురవాడ, పీఎంపాలెం మీదుగా విశాలాక్షినగర్, తెన్నేటిపార్క్ మీదుగా కాళీమాత ఆలయానికి ర్యాలీ చేరుకుంటుందని చెప్పారు. అనంతరం కాళీమాత ఆలయం నుంచి బీచ్‌రోడ్‌లో శోభాయాత్ర ఉంటుందన్నారు.

గీతం వర్సిటీపై సిటీ పోలీసు జట్టు గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ వార్షిక లీగ్ టోర్నీలో భాగంగా శుక్రవారం గీతం యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో సిటీ పోలీసు 12 పరుగుల తేడాతో గీతం వర్సిటీపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీసు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 154 పరుగుల స్కోరు చేసింది. అనీష్ హాఫ్ సెంచరీ (62), విశ్రినాథ్ (28) రాణించారు. గీతం బౌలర్ వెంకటరావు మూడు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో చివరి బంతి వరకు పోరాడిన గీతం యూనివర్సిటీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 142 పరుగులు చేసి ఓటమి చెందింది. అభిషేక్ (56),జాన్ రెజినాల్డ్ (51) అర్ధ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. సిటీ పోలీసు బౌలర్ ఎల్. శ్రీను మూడు వికెట్లు పడగొట్టాడు.

అలరించిన నృత్యాలు

సింహాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సింహగిరిపై శుక్రవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సాయంత్రం 5 గంటలకు గాజువాక ప్రాంతానికి చెందిన నాట్యారాధన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధి కనకరాజు సారథ్యంలో, సాయంత్రం 6 గంటలకు విజయనగరం ప్రాంతానికి చెందిన శ్రీహరి స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత అరుణ్ సారథ్యంలో కళాకారులు పలు కీర్తనలకు నృత్యం చేశారు. అనంతరం అధికారులు కళాకారులను సత్కరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

భీమునిపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఎగువపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని బీజేపీ నాయకులు శుక్రవారం సందర్శించారు. గామ్ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాయకులు కేంద్రాన్ని సందర్శించి, కార్యకర్తను సమస్యలు అడిగారు. అనంతరం ప్రభుత్వం అందించిన పౌష్టికాహార కిట్లు గర్భిణిలు, బాలింతలకు పంపిణీ చేశారు. అక్కడి నుంచి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో జరిగిన వేడుకల్లో దళిత సంఘాల నాయకులు



దాకమర్రిలో పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే

భీమునిపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. భీమిలి పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో దళిత నాయకుడు భాగం గోపాలరావు ఆధ్వర్యంలో పలువురు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గోడి నాగేశ్వరరావు మాట్లాడుతూ వెనుబడిన వర్గాలకు విద్య అందించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. సమాజంలో కుల వివక్షను, అన్యాయాలను రూపుమాపడానికి తన జీవితాన్నే త్యాగం చేశారని చెప్పారు. కార్యక్రమంలో దళిత నాయకులు భాగం గోపాలరావు, బి. లక్ష్మి, కృష్ణవేణి, ఎం. శివ, టి. లక్ష్మి, జి. గౌరి, కె. లక్ష్మి, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేటలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. బీజేపీ నాయకులు చిల్ల త్రినాథరెడ్డి, సుహాసిని ఆనంద్, తదితరులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామాలయంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాధవరావు, నందకుమారి, పినగాడి విజయ, సీరపు రామలక్ష్మి పాల్గొన్నారు. జీవీఎంసీ బంగ్లామెట్ట పాఠశాలలోనూ పూలే జయంతి నిర్వహించారు. ఉపాధ్యాయులు పూలే జీవిత చరిత్రను, ఆయన చేసిన సంఘ సంస్కరణలు గురించి విద్యార్థులకు వివరించారు.

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని తాటితూరు, దాకమర్రి గ్రామాల్లో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా జరిగింది. తాటితూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం సన్యాసినాయుడు విద్యార్థులకు పూలే జీవిత చరిత్రను తెలియజేశారు. దాకమర్రిలో దళిత కులాల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో భీమిలి తహసీల్దార్ రామారావు, ఆ సంఘం అధ్యక్షుడు పతివాడ రాంబాబు, టీడీపీ నాయకులు ఎస్.ప్రకాశ్, నాని, రవ్వ ఈశ్వరరావు, బోని కృష్ణ పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : మహాత్మా జ్యోతిరావు పూలే మహిళా సాధికారతకు విశేష కృషి చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు చోడవరపు నాగరాజు అన్నారు. పూలే జయంతి సందర్భంగా రుషికొండలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాలకు విద్య అందించడంలోనూ,మహిళా విద్యను ప్రోత్సహించడంలోనూ ఆయన చేసిన కృషి ఎనలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాంబాబు, గరికిన ఎల్లాజి, తదితరులు పాల్గొన్నారు.



చిట్టివలసలోని గోస్తనీ నదిలో ఉన్న ఇన్‌ఫిల్టరేషన్ బావులు



తరచూ మరమ్మతుకు గురవుతున్న పంపింగ్ యంత్రాలు

అరకొరగా తాగునీటి సరఫరా

- తగరపువలస, చిట్టివలసలో ప్రజలకు ఇబ్బందులు
- గోస్తనీ నదిలో నిరుపయోగంగా ఇన్‌ఫిల్టరేషన్ బావులు
- పాడవుతున్న సామగ్రి

తగరపువలస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఇన్‌ఫిల్టరేషన్ బావులు నిరుపయోగంగా ఉండడం, చిట్టివలసలోని తాగునీటి పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. చిట్టివలస పక్కనున్న గోస్తనీ నదిలో తాగునీటి కోసం భీమిలి మున్సిపాలిటీ నలభై ఏళ్ల క్రితం నిర్మించిన తాగునీటి పథకం పాడైపోయింది. ఈ పథకానికి సంబంధించి గోస్తనీలో నిర్మించిన ఇన్‌ఫిల్టరేషన్ బావులు కూడా పాడైపోయాయి. చిట్టివలస సమీపంలోని కొండపేట వద్ద చిన్నగుట్ట మీద ఈ పథకాన్ని నిర్మించారు. ఇక్కడి నుంచే భీమిలి మున్సిపాలిటీలో చాలా ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరిగేది. పద్మనాభం మండలం సామేయవలస వద్ద 2007లో కొత్తగా వాటర్ ట్యాంకు నిర్మించిన తరువాత భీమిలి జీవీఎంసీలో విలీనం కావడంతో ఈ పథకానికి ఆదరణ లేకుండా పోయింది. దీని నిర్వహణ కూడా ప్రశ్నార్థకంగా మారింది. నదిలో నిర్మించిన పది ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో ఏడు వట్టిపోయాయి. నదిలో నీటి పథకానికి అనుబంధంగా క్లోరినేషన్ ప్లాంటు, పంపింగ్ యంత్రాలు వంటివి ఏర్పాటు చేశారు. సిబ్బందికి రెండు క్వార్టర్లు కూడా నిర్మించారు. సామేయవలస ట్యాంకు ద్వారా నీరు సరఫరా చేస్తుండడంతో చిట్టివలసలో నిర్మించిన ట్యాంకును నిరుపయోగంగా వదిలేశారు.అందులో ఉన్న యంత్రాలు కూడా పాడైపోయాయి. కొద్ది రోజులుగా ఈ ట్యాంకు నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు చెబుతున్నారు. పురాతనమైన ఈ ట్యాంకును వినియోగంలోకి తీసుకువస్తే ఇక్కడి నుంచి కూడా తాగునీటి సరఫరాకు అవకాశం ఏర్పడుతుంది. అదే సమయంలో చిట్టివలస నదిలో ఉన్న ఇన్‌ఫిల్టరేషన్ బావుల నుంచి గొట్టాల ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సి ఉంది. గతంలో ఇక్కడి నుంచే తాగునీటి సరఫరా జరిగేది. కానీ ప్రస్తుతం పంపింగ్‌కు అవకాశం లేకుండా ఉంది. భీమిలి. చిట్టివలసలో ఉన్న పురాతనమైన ఈ పథకానికి సంబంధించి నదిలో వట్టిపోయిన బావుల్లో కొన్నింటినైనా పునరుద్ధరిస్తే సమస్య కొంతవరకైనా పరిష్కారమవుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. వట్టిపోయిన బావులను పునరుద్ధరించడంతో పాటు ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న



మాడవీధుల్లో స్వామివారి తిరువీధి ఉత్సవం

సింహాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి సూర్యప్రభ వాహనంపై శుక్రవారం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా తీర్చిదిద్ది సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేశారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనులు, పండితుల వేదమంత్రోచ్ఛారణలు, కళాకారుల కోలాటాల నడుమ మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా జరిపారు. మార్గం పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలతో స్వామివారిని స్వాగతించారు. కాగా ఉత్సవాల్లో భాగంగా సంప్రదాయబద్ధంగా హవనం నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు పూర్తయిన తరువాత యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ముందుగా సిద్ధం చేసిన మండపంలో అధిష్ఠింపజేశారు. అనంతరం ఆలయ వైదికులు సంప్రదాయం ప్రకారం తోరణ పూజలు, ద్వార పాలకులకు, యజ్ఞ భగవానునికి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం హవనాన్ని ఆగమోక్తముగా జరిపారు.

ఒకేషనల్ శిక్షణ తరగతులు పరిశీలన

భీమునిపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లలపాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ కోర్సు శిక్షణ తరగతులను జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ చంద్రశేఖరరావు శుక్రవారం పరిశీలించారు. ఈమేరకు ఆయన తరగతుల నిర్వహణపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జీసీడీఓ కలిషా బేగం, కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగాకుమారి ఉన్నారు.

త్రైత సిద్ధాంతం తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

పద్మనాభం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన తెలుగు క్యాలెండరును భీమిలి ఏఎంసీ ఛైర్మన్ రామస్వామి నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరావు, సీఐ సీహెచ్ శ్రీధర్ శుక్రవారం ఆవిష్కరించారు.మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ తోటారావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు మార్పు

తగరపువలస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని బొగ్గు రోడ్డు వద్ద ఉన్న 1, 2 గ్రామ సచివాలయాలను శుక్రవారం వేరే ప్రాంతాలకు మార్పు చేశారు. రెండు కార్యాలయాలను తగరపువలసలో ఉన్న పాత ఈ సేవా కేంద్రాల కార్యాలయంలోకి మార్పు చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృష్ణాకాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. భీమిలి, నేరెళ్లవలస, జేవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, కుమ్మరిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యలపై పోరాటం : సీపీఐ

తగరపువలస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దశల వారీగా ఆందోళన చేపట్టాలని సీపీఐ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. శుక్రవారం ఆ పార్టీ నాయకులు స్థానిక కార్యాలయంలో సమావేశమయ్యారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పద్మనాభం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయనిక ఎరువులు లేని ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలు పండించాలని ఏపీ తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కురిమిన లీలావతి తెలిపారు. అయినాడ గ్రామంలో వ్యవసాయాధికారులు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ పంటలకు ముందు నవ ధాన్యాలను భూమిలో వేసి 45 రోజుల తరువాత కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో సత్ఫలితాలు సాధిస్తున్న ఆదర్శ రైతులు సత్యారావు, కృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం. శివరామకృష్ణ, వ్యవసాయ సహాయకులు లావణ్య, ఎన్ఎఫ్ఐ హేమసుందర్, మాస్టర్ ట్రైనరు విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ఎర్నిమాంబ ఉత్సవాలు



భీమునిపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మంగమారిపేట గ్రామ దేవత ఎర్నిమాంబ ఉత్సవాలు వచ్చే నెల 3 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గరికిన యల్లయ్య (కింగ్) తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 3న రాత్రి తొలేళ్లు, 4న సాయంత్రం పలు నేలవేషాలు, బళ్లవేషాలతో అనుపోత్సవం జరుగుతుందన్నారు. 5న అమ్మవార్ల ఊరేగింపు, 7న సాయంత్రం లంకా దహనం, 8న సాయంత్రం మహాత్మా గాంధీజీ ఊరేగింపు, అమ్మవార్ల జాతర జరుగుతాయని చెప్పారు.ప్రతిరోజూ స్టేజ్ ప్రోగ్రామ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



నిర్మాణ సామగ్రి వల్ల నిలిచిపోయిన వాహనాలు

రోడ్డుపై నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు

ఎండాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డులో కొందరు భవన నిర్మాణ యజమానులు సామగ్రి వేస్తుండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో ఎక్కువగా వాణిజ్యపరమైన నిర్మాణాలు జరుగుతున్నాయి. యజమానులు నిర్మాణ సామగ్రిని పనులు జరుగుతున్న ప్రాంతంలోని రోడ్డు పక్కన వేస్తుండడం, అదే చోట కొందరు వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు యథావిధిగా రిజిస్ట్రేషన్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు 12వ తేదీన రెండో శనివారం సెలవు అయినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయం పనిచేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియా ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని డీఐజీ బాలకృష్ణ తెలిపారు. తాము కూడా కార్యాలయంలోనే అందుబాటులో ఉంటామన్నారు.

దళారులుగా మార్కెటింగ్ శాఖాధికారులు

... 5వ పేజీ తరువాయి

రేటు పెరగకుండా స్థిరంగా ఉండేలా చూశామని,ఆ విషయం గుర్తించాలని చెబుతున్నారు.

రైతులకు నష్టాలు

రైతులు, డ్వాక్రా సంఘాలు హోల్‌సేల్‌లో టమాటా కొంటే వారికి క్రేటుకు రెండు కిలోలు తరుగు కింద ఇస్తారు. అధికారులు మాత్రం క్రేటు మొత్తానికి లెక్క కట్టి డబ్బులు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రైతు రోజుకు ఐదు క్రేట్ల టమాటా అమ్మితే పది కిలోల దగ్గర తరుగు కోల్పోతున్నాడు. అది కాకుండా రవాణా చార్జీలు అధికంగా ఉంటున్నాయి. అధికారులు ఇచ్చిన టమాటా అమ్మడం వల్ల రైతుల్లో దాదాపుగా 50 శాతం మందికి లాభం రాకపోగా చేతి డబ్బులు పడుతున్నాయి. ఈ విషయం ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. టమాటా వద్దని చెప్పినా బలవంతంగా అమ్మిస్తున్నారు. ఈ వ్యవహారం పూర్తిస్థాయిలో ఏడాది మొత్తం కొనసాగించడానికి ఇప్పుడున్న అధికారులు ప్లాన్ చేస్తున్నారు. బజార్లకు వచ్చే రైతుల వద్ద ఇంకా ఎన్ని రోజులు సొంత టమాటా (పండించినది) వస్తుందో ముందే అడిగి తెలుసుకొని లెక్కలేసుకుంటున్నారు. పైగా విశాఖపట్నంలో రైతులు దళారుల్లా మారిపోయారని, పంటలు పండించకుండా హోల్‌సేల్‌లో కొని ఎక్కువకు అమ్మి లాభపడుతున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ రైతుబజార్లను సందర్శించి తమ కష్టాలు తెలుసుకుంటే ఈ బాధలు ఉండవని, ఎవరు చెబుతున్నది నిజమో తెలుస్తుందని రైతులు అంటున్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

... 5వ పేజీ తరువాయి

అక్కడ మినహాయింపు ఇవ్వాలి. పద్మనాభం, భీమిలి మండలాల్లో గల 20 యూపీ పాఠశాలల రద్దును ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకించడంతో వాటిని కొనసాగించాలని నిర్ణయించారు. మరో మూడు యూపీ పాఠశాలలను రద్దు చేసి వాటిని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేయగా, ఆరు స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. నగరంలో బుచ్చిరాజుపాలెం, ముస్లింతాటిచెట్లపాలెం, డాబాగార్డెన్స్‌తోపాటు మరో మూడు యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మారుస్తున్నారు. తాజా నిర్ణయంతో ఉన్నత పాఠశాలల సంఖ్య 86 నుంచి 92కు పెరిగింది. అలాగే గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలలకు తరలించిన 3,4,5 తరగతులను వెనక్కి తీసుకువచ్చారు. కానీ 11 చోట్ల మాత్రం తరగతుల షిఫ్టింగ్‌ను తల్లిదండ్రులు వ్యతిరేకించారు. ఆ పదకొండుచోట్ల కూడా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం పిల్లల సంఖ్య 30కు అటుఇటుగా ఉండడంతో వాటిని అదే గ్రామంలో ఉన్న హైస్కూలులోనే కొనసాగిస్తారు. వీరి కోసం ప్రత్యేకించి బేసిక్ పాఠశాలలు ఏర్పాటుచేసి ఉన్నత పాఠశాలల టీచర్లతో బోధన అందిస్తారు.

ఒక్క పాఠశాల కూడా మూతపడదు

- ఎన్.ప్రేమ్‌కుమార్, డీఈవో, విశాఖ

జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ముగిసింది. దీని ప్రకారం పాఠశాలలు 568కు పెరిగాయి. ఈ ప్రక్రియ కోసం పాఠశాల యాజమాన్య కమిటీల అభిప్రాయాలు తీసుకున్నాం. అందుకే ఇరవై చోట్ల యూపీ స్కూళ్లు కొనసాగించాలని నిర్ణయించాం. జిల్లాలో ఒక్క పాఠశాల కూడా మూతపడడం లేదు. తక్కువ మంది పిల్లలున్నచోట్ల ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటుచేస్తున్నాం.

యథేచ్ఛగా ఆహార పదార్థాల కల్తీ

... 5వ పేజీ తరువాయి

క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అలాగే, దుకాణాల నుంచి సేకరించిన 22 నమూనాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించినట్టు తేలింది. అంటే అయోడిన్ సాల్ట్‌లో అయోడిన్ ఉండాలి. కానీ, లేకుండానే అయోడిన్ ఉన్నట్టు చెప్పి విక్రయాలు సాగిస్తారు. అలాగే, పప్పు, ఇతర పిండి పదార్థాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల పురుగులు పట్టడం జరుగుతుంది. వాటిల్లో కూడా నాణ్యత ఉండదు. అటువంటి 22 కేసులకు సంబంధించి ఇప్పటివరకూ 19 మంది వ్యాపారులకు జేసీ కోర్టులో జరిమానా విధించారు. ఆయా దుకాణాల నిర్వాహకులకు రూ. 3. 54 లక్షల జరిమానా విధించారు. మరో 31 నమూనాల్లో కల్తీతో పాటు నాణ్యత ప్రమాణాలు తక్కువగా ఉన్నట్టు తేలింది. వీటిలో వివిధ రకాల కల్తీలు ఉన్నట్టు చెబుతున్నారు. మరో 40 నమూనాలకు సంబంధించిన ఫలితాలు రావాల్సి ఉందని చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

అన్నిరకాల ఆహార ఉత్పత్తులు, పదార్థాల్లో కల్తీ జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. వీలైనంత వరకు బయట ఆహారానికి దూరంగా ఉండడం ద్వారా కల్తీ కాటు నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

కర్నూలు, బెంగళూరు, తిరుపతికి ప్రత్యేక రైళ్లు

... 5వ పేజీ తరువాయి

ఉదయం 9.35 గంటలకు కర్నూలు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08546 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి వచ్చే నెల 28 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.10 గంటలకు కర్నూలులో బయలుదేరి మర్నాడు ఉదయం 8.00 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-బెంగళూరు-విశాఖ: 08581 నంబరు గల రైలు ఈనెల 13 నుంచి వచ్చే నెల 25 వరకూ ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08582 నంబరు గల రైలు ఈనెల 14 నుంచి వచ్చే నెల 26 వరకూ ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-తిరుపతి-విశాఖ: 08547 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి వచ్చే నెల 28 వరకూ ప్రతి బుధవారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08548 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి వచ్చే నెల 29 వరకూ ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరునాడు ఉదయం 11.30 గంటలకు విశాఖ చేరుతుంది.

ప్రమాదకరంగా గోస్తనీ నదిపై వంతెన రెయిలింగ్



వంతెనపై శిథిలమైన రెయిలింగ్

పద్మనాభం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని గోస్తనీ నదిపై ఉన్న వంతెన రెయిలింగ్ ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు భయపడుతున్నారు. ఈ రెయిలింగ్ శిథిలమై విరిగిపోవడంతో వంతెన మీదకు వచ్చిన వారు కిందకు చూస్తే పడిపోతామోనన్న భయం నెలకొంటోంది. వంతెన ఇరువైపులా రక్షణ కవచంలా ఏర్పాటు చేసిన ఈ రెయిలింగ్‌కు ఏళ్ల తరబడి నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వీటికి మరమ్మతు చేసి విరిగిన వాటిని తొలగించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 20 వినతులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 20 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, నిర్ణీత సమయంలోనే వచ్చిన దరఖాస్తులను అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సీసీపీ ఆదేశించారు.

గురుకుల ప్రవేశ పరీక్ష రేపు

కొమ్మాది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఐదు, 11వ తరగతిలో ప్రవేశానికి 13న పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డి.శాంతకుమారి తెలిపారు. ఉదయం 10 నుంచి 12 వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు 11వ తరగతి ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.http:// apbragcet.apcfss.in నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్, ఆధార్‌కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో పరీక్షకు హాజరు కావాలన్నారు.జు

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచితశిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2 నెలలు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ ఇవ్వనున్నట్టు రామాటాకీస్ సమీపంలో గల సంస్థ కార్యాలయంలో ఏప్రిల్ 16 నుంచి జూన్ 16 వరకు శిక్షణ ఇస్తామని, మరిన్ని వివరాల కోసం ఫోన్ : 80193 88999లో సంప్రదించాలని కోరారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలో వేంచేసియున్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు,మధ్యాహ్నం స్వామివారి ప్రసాద వితరణ, నారాయణ సేవ కార్యక్రమంచేపట్టారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని స్వామి వారిని భక్తితో కొలిచారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కర శర్మలు ప్రత్యేక అభిషేకాలు చేపట్టి, తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం స్వామివారిని తిరువీధి మహోత్సవం జరిపి, రాత్రి పవళింపు సేవ, హరివరాసనంతో కార్యక్రమాలను ముగించారు. కార్యక్రమంలో గ్రామసేవా సంఘం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
● **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
● **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
● **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
● **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), తాతా(తగరపువలస)
● **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 28, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 22, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో)24, అల్లం (పాతది) 48, బరబాటి 20, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడ దుంపలు 36, కంద 52, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



వెంకోజీపాలెం : ఇసుకతోటలోని బీసీ హాస్టల్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్



ఎంవీపీ కాలనీ : జ్యోతిరావు పూలేకు నివాళులు అర్పిస్తున్న వెలగపూడి ప్రతాప్, పలువురు టీడీపీ నేతలు

ఆదర్శప్రాయుడు జ్యోతిరావు పూలే

» జయంతి సందర్భంగా పలువురి నివాళి
» బీసీ హాస్టల్ విద్యార్థులతో కలెక్టర్ సహపంక్తి భోజనం

'మహాత్మా' జ్యోతిరావు పూలే జయంతిని పలు చోట్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేటి తరానికి పూలే ఆదర్శప్రాయులని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. మహిళా విద్య ప్రాధాన్యాన్ని జన బాహుళ్యంలోకి తెచ్చిన ఘనత జ్యోతిరావు పూలేకే దక్కుతుందన్నారు.

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఇసుకతోట బీసీ హాస్టల్ విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మహనీయుని స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక తీపి గుర్తుగా ఉండాలనే ఉద్దేశంతో విద్యార్థులతో కలిసి భోజనం చేసినట్టు కలెక్టర్ చెప్పారు. బీసీ వర్గాల అభ్యున్నతికి పేద ప్రజల సంక్షేమానికి జ్యోతిరావు పూలే విశేష సేవలు అందించారని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, సమాజ సేవలో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, చక్కగా చదువుకోవాలని హితవు పలికారు. ఏమైనా అవసరాలు ఉంటే బీసీ సంక్షేమ అధికారి శ్రీదేవి ద్వారా తన దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవితో పాటు హాస్టల్ వెల్ఫేర్ అధికారి నాగలక్ష్మి, సహాయక బీసీ వెల్ఫేర్‌అధికారి కృష్ణారావు, విద్యార్థులుపాల్గొన్నారు.

ఏయూలో..

వెంకోజీపాలెం : ఏయూలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ ప్రాంగణంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి వర్సిటీ వీసీ జీపీ రాజశేఖర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు, మహిళా విద్య, స్త్రీల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే దంపతులు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు , డీన్లు, ఇతర ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో..

ఎంవీపీ కాలనీ (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ పాల్గొన్నారు. టీడీపీ నాయకులు గాడి సత్యం, కాళ్ల శంకర్, నక్క కనకరాజు, బొట్ట వెంకటరమణ, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి అప్పారావు, శ్రీను, హిమయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

మద్దిలపాలెం (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే 'మహాత్మా' బిరుదు పొందిన తొలి వ్యక్తి జ్యోతిరావు పూలేనని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు పేర్కొన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాబురావు మాట్లాడుతూ సామాజిక అసమానతలను తొలగించడానికి ఎంతగానో కృషి చేసిన మహోన్నత వ్యక్తి పూలే అన్నారు. గొప్ప సామాజికవేత్త అయిన పూలే బడుగు బలహీనవర్గాలకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. పూలే ఆశయాలు జగన్ కొనసాగించారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, వైసీపీ నేతలు జహీర్ అహ్మద్, రవిరెడ్డి, మొల్లి అప్పారావు, పీతల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ఎస్కెఎల్ఎం నగర్ ఐదో సెక్టార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు పాల్గొనిజ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, నేతలు చిట్టూరి సత్యనారాయణ, సిహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మద్దిలపాలెం : వైసీపీ కార్యాలయంలో పూలేకు నివాళులు అర్పిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు, పార్టీ నేతలు



వెంకోజీపాలెం : ఏయూలో పూలేకు నివాళు అర్పిస్తున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు, విద్యార్థులు



ఆరిలోవ : 12వ వార్డులో పూలేకు నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేత సత్యం తదితరులు

'విమ్స్' సేవలు ప్రశంసనీయం

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సత్కరిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, ఇతర వైద్యులు

ఆరిలోవ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందిస్తున్న కేజీహెచ్‌నకు ప్రత్యామ్నాయంగా విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్) సేవలు అందిస్తుండడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. విమ్స్ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ విమ్స్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందుతుండడంతో రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. దీనివల్ల కేజీహెచ్‌పై కొంత మేరకు ఒత్తిడి తగ్గిందన్నారు. ఇటీవల విమ్స్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయడం ద్వారా రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి ఆస్పత్రిగా రికార్డుకెక్కిందన్నారు. ఇటువంటి అరుదైన మరెన్నో ఘనతలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. జీవన్‌ధాన్ కార్యక్రమం అవగాహన కల్పించడంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు విశేష కృషి చేస్తున్నారని అభినందించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ.. విమ్స్‌లో అందిస్తున్న సేవలు గురించి వివరించారు. ఇక్కడ ఎప్పుడూ మెరుగైన వైద్య సేవలు అందించడానికి తమ సిబ్బంది కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ డాక్టర్ మాజీ వీసీ రవిరాజు, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున్, ఐఓసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే : ఆర్టీసీ ఆర్ఎం



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాలకు ఆశాజ్యోతిగా మహాత్మా జ్యోతిరావు పూలే నిలిచారని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ద్వారకా బస్‌స్టేషన్ ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా విద్య కోసం ఆయన కృషి చేశారన్నారు. ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ దుర్గాప్రసాద్, అకౌంట్స్ ఆఫీసర్ వంశీమోహిని, అసిస్టెంట్ మేనేజర్ కమర్షియల్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో..

ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం రామ్మోహన్ భవన్‌లో జరిగిన జ్యోతీరావు పూలే జయంతి ఉత్సవాల్లో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైశ్రీనివాసరావు పాల్గొని జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యం

» బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పూర్ణచంద్రరావు

సిరిపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యమని మాజీ డీజీపీ, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త డా.జె.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది బీసీలున్నా అగ్రకులాల వారే రాజకీయాల్లో రాణిస్తున్నారన్నారు. రాజకీయ నేతలే ప్రజలకు అసలైన సమస్యగా మారిపోయారని విమర్శించారు. జ్యోతిబాపూలే 176 ఏళ్ల క్రితమే బీసీ సమస్యలపై పోరాడారన్నారు. ప్రభుత్వం కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ సిద్ధాంతాలను రాష్ట్రమంతా తెలియజేస్తామన్నారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో జనాభా ప్రాతిపదికన 52 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వి.శివప్రసాద్‌రావు, గౌతమ్‌కుమార్, కనకమహాలక్ష్మి, సురేశ్, సూరప్పడు, రమణయాదవ్, దేవిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో విభిన్న నైపుణ్యాలను పెంపొందించాలి

» ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ నాగరాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య నాగరాజకుమారి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఐఏఎస్ఈ, ఏయూ విద్యా విభాగంతో సంయుక్తంగా జాతీయ విద్యా విధానం 2020 -సహిత విద్యలో నూతన బోధన పద్ధతులు అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల పునరావాస విద్యా కార్యక్రమం (అధ్యాపకుల పునశ్చరణ తరగతులు)ను ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డి.నాగరాజకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజకుమారి మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారుల్లో విభిన్న నైపుణ్యాలను పెంపొందించే దిశగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. వివిధ శారీరక, మానసిక వైకల్యం కలిగిన దివ్యాంగ చిన్నారులు తమ జీవనం సాగించడానికి ఉపయుక్తంగా నిలిచే నైపుణ్యాలను వారిలో పెంపొందించడానికి అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రెండు రోజుల శిక్షణా తరగతుల్లో నిపుణులు అందించే సూచనలను ఆచరణలో చూపుతూ తమ బోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని అధ్యాపకులకుఆమె సూచించారు. సదస్సు కో-ఆర్డినేటర్, ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ చిన్నారుల కోసం వారిలో అవసరమైన బహుళ నైపుణ్యాలను పెంపొందించడానికి పలు సాంకేతిక ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ-న్యూఢిల్లీ) పూర్వ సభ్యులు ఆర్.రంగనాథన్, డాక్టర్ ఎం.ప్రభాకరరావు, డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు. ఆర్‌సీఐ సభ్యత్వం కలిగిన 50 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు వృత్యాంతర శిక్షణ కోసం హాజరయ్యారు.

పలు చోట్ల చలివేంద్రాల ఏర్పాటు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పలు సేవా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు వాడవాడలా చలివేంద్రాలను శుక్రవారం ప్రారంభించాయి. ఎంవీపీ కాలనీ అళ్వార్‌దాస్ డిగ్రీ కళాశాల సమీప అళ్వార్‌దాస్ కూడలిలో అళ్వార్‌దాస్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎస్వీహెచ్ రాజేంద్ర, డైరెక్టర్ రాహుల్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఏఎస్‌రాజా మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కాసు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అప్పారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొత్త వెంకోజీపాలెం సిగ్నల్ బస్టాండ్ వద్ద శ్రీసమర్థ సద్గురు సాయినాథ్ దేవాలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి బస్టాప్‌కు వచ్చిన వారికి, రోడ్డుపై వెళ్లే వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. రెండు నెలల పాటు ఈ చలివేంద్రాన్ని కొనసాగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. టీడీపీ నాయకులు కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు, కాళ్ల ఆనంద్, సూరిబాబు పాల్గొన్నారు

ఏయూలో 'భిన్నత్వంలో సమానత్వం'



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిరావుపూలే, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వారోత్సవాల సందర్భంగా 'భిన్నత్వంలో సమానత్వం' పేరిట మూవ్‌మెంట్ 21, జాతీయ సేవా పథకం యూనిట్-2, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల సంయుక్తంగా ఏయూలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు తొలుత ఏయూలో భిన్నత్వం సమానత్వం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ వేడుకల్లో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య పాల్గొని ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి సామాజిక విప్లవ యోధుడు జ్యోతిరావు పూలే అని, ఈ దేశంలో ఉన్న అసమాన కుల వ్యవస్థపై అలుపెరగని పోరాటం చేసి సమాజాన్ని విద్యతో మాత్రమే చైతన్య పరచగలమని, 1848లోనే మహిళలు, శూద్రులు, అతి శూద్రులకు రాత్రి పాఠశాలలను ప్రారంభించి సమాజాన్ని మేల్కొల్పారని, అలాగే గులాంగిరి దీనబంధు చెర్నాకోలా, స్వాజనీక సత్యదమ్మ వంటి పుస్తకాలను రాశారని కొనియాడారు. అంటరానితనం వంటి అసాంఘిక కార్యక్రమాలపై నిత్యం పోరాటం చేసి, ఈ దేశంలో మహిళలకు శూద్రులకు, అతిశూద్రులకు విద్యను అందించటానికి తన జీవితకాలం పోరాటం చేశారన్నారు. అనంతర కాలంలో బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అదే బాటలో జ్యోతిరావు పూలే ఆశయాలను తన ఆశయాలుగా మార్చుకుని, ఈ దేశంలో మెజారిటీ ప్రజలైన శూద్ర, అతిశూద్రు, మహిళలకు చదువుకునే హక్కు, ఓటు హక్కు, ఆస్తి హక్కును కల్పించేలా కృషి చేసి మనిషిగా జీవించే అవకాశం భారత రాజ్యాంగం ద్వారా చట్టబద్ధం చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మూవ్‌మెంట్ 21 జాతీయ బాధ్యత సభ్యులు డాక్టర్ మృత్యుంజయ, విద్యార్థి నాయకులు విజయ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీరులు కల్యాణ్‌వనం, సాయి, యోగి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో ఏయూ విద్యార్థికి బహుమతి



విద్యార్థి మహాలక్ష్మిని అభినందిస్తున్న ఆచార్యులు ఎ.నరసింహారావు, వానపల్లి వెంకట్రావు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న కర్ణాటక రాష్ట్ర ధార్వాడకు చెందిన సెంటర్ ఫర్ మల్టీ డిసిప్లినరీ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో ఏయూ తత్వశాస్త్ర విభాగానికి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థిని కోన మహాలక్ష్మి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. డైరెక్టర్ ఆచార్య బసవప్రభు జిర్లి చేతుల మీదుగా ధార్వాడలో విద్యార్థినికి రూ.7000, బహుమతితో పాటుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. 'భారతీయ పురాతన విజ్ఞానం - ప్రాతిపదికన ప్రాచీన సంప్రదాయాలు' సమకాలీన సమస్యలు అనే అంశంపై రాసిన వ్యాసానికి జాతీయ స్థాయి ద్వితీయ బహుమతిని పొందడం వర్సిటీకి ఎంతో గర్వకారణమని బహుమతి పొందిన విద్యార్థినిని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసించారు. కార్యక్రమంలో తత్వశాస్త్ర విభాగాధిపతి వానపల్లి వెంకట్రావు, డాక్టర్ వీరకుమార్ పాల్గొన్నారు.

సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్ బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడటంతో శుక్రవారం ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పనులు ప్రారంభించారు. మిగిలిన మూడు యూనిట్‌ల్లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

హనుమంతవాక జంక్షన్‌లో చలివేంద్రం ఏర్పాటు

ఆరిలోవ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌లో శుక్రవారం టీడీపీ సభ్యులు, ఆటోస్టాండ్ సభ్యులు సంయుక్తంగా చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాపరుద్ర కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, విశాఖ పార్లమెంట్ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, తూర్పు ఐ.టీడీపీ ఇన్‌చార్జి బాదరు బాలరాజు, టీడీపీ 9వ వార్డు ప్రధాన కార్యదర్శి గెడ్డవలస వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే



బీజేపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



గ్రీన్‌పార్కు రోడ్డులో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



సీతమ్మధార ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద అధికారులు, ఉద్యోగులు

సీతమ్మధార, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే సంఘ సంస్కర్త, గొప్ప దేశభక్తుడని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు శ్లాఘించారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా సీతమ్మధారలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే దంపతులు సమాజంలో నిమ్నజాతులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి విశేష కృషిచేశారని పేర్కొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్) డి.చంద్రం పేర్కొన్నారు. సీతమ్మధారలోని సంస్థ కార్యాలయ ప్రాంగణంలో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి సంస్థ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, ఏజీఎంలు డి.సుమన్ కల్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రథమ సామాజిక కార్యకర్త

సీతంపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రథమ సామాజిక కార్యకర్త జ్యోతిరావు పూలే అని, ఆయన సమ సమాజ స్థాపనకు ఎంతో కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే చారిటబుల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. అఖిల భారత శరీర దాతల సంఘం వ్యవస్థాపకురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి రచించిన 'సావిత్రిబాయి మార్గంలో సీతామహాలక్ష్మి' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ వ్యాపారవేత్త, విజయ నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకులు విజయ్‌కుమార్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. నిరుపేద వైద్య, నర్సింగ్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేశారు. డాక్టర్ బండి సత్యనారాయణ, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఆర్.చంద్రశేఖర్, డాక్టర్ కె.ఎస్.మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నారా నాగేశ్వరరావు, మర్రివేముల శ్రీనివాస్, కోనూరు శ్రీనివాస్, శ్రీనివాస్ పట్నాయక్, పోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ ఘన నివాళులు

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శీనివాస్ ఘనంగా నివాళుల ర్పించారు. గ్రీన్‌పార్కు రోడ్డులోని పూలే విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి పూలే చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆదర్శాలతో బలహీనవర్గాలకు సేవ చేయాలని కోరారు. పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కట్టడికి పోలీసు అధికారుల నిర్ణయం

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరం మీదుగా రైళ్లలో గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా కట్టడి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని విశాఖ నగర పోలీసు అధికారుల సమావేశంలో నిర్ణయించారు. శుక్రవారం పోలీసు సమావేశ మందిరంలో ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్, వివిధ విభాగాల డీసీపీలు, ఏసీపీలు, రైల్వేస్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల విభాగం పోలీసు అధికారులు సమావేశమై తాజా పరిస్థితిని సమీక్షించారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం ఇవ్వకుండా రైల్వే ఆస్తులు, భద్రతా స్టేషన్ వద్ద స్కానింగ్ మిషన్లు, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పొదలు తొలగించి విద్యుత్ సదుపాయం కల్పించడం, సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి కార్యాచరణతో గంజాయి రవాణాను అరికట్టి, రైల్వే ఆస్తుల పరిరక్షణను సమర్థంగా నిర్వహించాలని నిర్ణయించారు.

నేడు యథావిధిగా రిజిస్ట్రేషన్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు 12న రెండో శనివారం సెలవు అయినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయం పని చేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియా ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని డీఐజీ బాలకృష్ణ తెలిపారు. తాము కూడా కార్యాలయంలోనే అందుబాటులో ఉంటామన్నారు.

కలెక్టరేట్‌లో మజ్జిగ కేంద్రం ప్రారంభం



సందర్శకురాలికి మజ్జిగ అందిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు శుక్రవారం ఉచిత మజ్జిగ కేంద్రాన్ని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా సందర్శకులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండ వేడిమి నుంచి ఉపశమనంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ కౌంటరును కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపంపై స్థానికుల ఆగ్రహం



వివేకానంద వీధిలో కాలువ నిర్మాణ పనులు

కంచరపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధిలోని వివేకానంద వీధి, శ్రీనగర్, సన్‌రైజ్ క్లబ్ ప్రాంతాల్లో కాలువలు, రోడ్ల నిర్మాణానికి మంజూరైన నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత లేకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వివేకానంద వీధిలో అచ్చిబాబు కల్యాణ మండపం నుంచి దిగువ రోడ్డు వరకు ఇరువైపులా కాలువ నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం కాలువ అడుగుభాగంలో పిక్క, సిమెంట్‌తో కూడిన కాంక్రీట్ వేయకుండా పనులు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పనులను బాధ్యులెవరూ పర్యవేక్షించకపోవడం గమనార్హం. మూడో పార్టీ తనిఖీ సిబ్బంది హాజరుకాకపోవడంపైనా సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతపై ప్రశ్నించాల్సిన స్థానిక ప్రజాప్రతినిధి కానరాకపోవడమేమిటని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి అందుబాటులో సౌకర్యం కేంద్రాలు

జ్ఞానాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆస్తి, ఖాళీ స్థలాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం రాయితీపై పన్ను చెల్లింపునకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నందున జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సౌకర్యం కేంద్రాలు శని, ఆది, సోమవారాలు కూడా పనిచేస్తాయని జోన్ అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 5 శాతం రిబేటుకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని ఇప్పటి వరకు జోన్‌లో రూ.4.3 కోట్లు వసూలైందని చెప్పారు. మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పించిన 50 శాతం వడ్డీ మాఫీ వెసులుబాటు ఏప్రిల్ 30 వరకు పొడిగించినందున బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రికెట్ లీగ్ టోర్నీలో గీతం వర్సిటీపై సిటీ పోలీసు గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ వార్షిక లీగ్ టోర్నీలో భాగంగా శుక్రవారం గీతం యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో సిటీ పోలీసు 12 పరుగుల తేడాతో గీతం వర్సిటీపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీసు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 154 పరుగుల స్కోరు చేసింది. అనీష్ హాఫ్ సెంచరీ (62), విశ్రినాథ్ (28) రాణించారు. గీతం బౌలర్ వెంకటరావు మూడు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో చివరి బంతి వరకు పోరాడిన గీతం యూనివర్సిటీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 142 పరుగులు చేసి ఓటమి చెందింది. అభిషేక్ (56), జాన్ రెజినాల్డ్ (51) అర్ధ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. సిటీ పోలీసు బౌలర్ ఎల్.శ్రీను మూడు వికెట్లు పడగొట్టాడు.

ఐటీఐ పరీక్షలు రాయడానికి దరఖాస్తులకు ఆహ్వానం

కంచరపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రైవేటు, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల్లో పనిచేస్తూ ఐటీఐ ధ్రువపత్రాలు లేని వారికి ప్రైవేటు అభ్యర్థిగా ఐటీఐ పరీక్షలు రాసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. సంబంధిత ట్రేడ్‌లో అభ్యర్థులు మూడేళ్ల అనుభవంతో నైపుణ్యం ఉన్నట్టు సంబంధిత సంస్థ ధ్రువీకరించాలి. అభ్యర్థులు వారి అర్హతలతో పాటు ఎంప్లాయిమెంట్ కార్డు జతచేసి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో తమ దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. ఇందుకు ఈ నెల 12 వరకు గడువు ఉంది. ఐటీఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పాస్ అయిన వారు, ఎస్‌సీవీటీ-2018 వరకు అడ్మిషన్ పొందినవారు, ఇతర అభ్యర్థులు ఎస్‌సీవీటీలో అడ్మిషన్ పొందినవారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. మరిన్ని వివరాలకు అభ్యర్థులు దగ్గరలో గల ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని శ్రీకాంత్ సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. గణేష్‌నగర్, సత్యసాయినగర్, నరసింహనగర్, రైతుబజారు ఏరియా, పోర్టు స్టేడియం వెనుక ఉన్న ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉక్కు పరిశ్రమలో ఉద్యోగుల తొలగింపు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కొత్త పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పిస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌లో ఉద్యోగుల తొలగింపుపై స్పందించకుండా చోద్యం చూస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు విమర్శించారు. శుక్రవారం సిటు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల తొలగింపును సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడతామని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలల్లో సుమారు 3 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, 1,213 మంది శాశ్వత ఉద్యోగులను వీఆర్ఎస్‌తో ఇంటికి పంపారని, ఈ నిర్ణయం ఉక్కు ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలిగిస్తుందన్నారు. అనకాపల్లి జిల్లా డీఎల్‌పురం రాజీపేట, బోయపాడు, అమలాపురం, బంగారమ్మపేట, పెంటకోట గ్రామాల పక్కనున్న 2.9 కి.మీ పొడవు సముద్ర ప్రాంతాన్ని ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌కు కేటాయించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సముద్ర తీరాన్ని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే విధానం దేశ ప్రయోజనాలకు హానికరమని నర్సింగరావు అన్నారు. ఈ సమావేశంలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో జనన ధ్రువీకరణ పత్రాల జారీ



జనన ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, చిత్రంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ గైనకాలజీ వార్డులో జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రాన్ని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టిన ప్రతీ బిడ్డకు గుర్తింపు ఒక ప్రాథమిక హక్కు అని, దీనికి ముఖ్య ఆధారం జనన ధ్రువీకరణ పత్రమని తెలిపారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జనన ధ్రువీకరణ పత్రాల కోసం వివిధ కార్యాలయాలకు వెళ్లవలసి వచ్చేదని, ఇప్పుడు గైనకాలజీ విభాగంలోనే నూతన కేంద్రం ఏర్పాటు చేయటం ద్వారా తల్లి ఆధార్ కార్డుతో వస్తే కేవలం 24 గంటల్లోనే బిడ్డ జనన ధ్రువీకరణ పత్రం చేతికి అందుతుందని తెలిపారు. అంతేకాకుండా శిశువు నామకరణం తరువాత వస్తే పేరుజోడించి జనన ధ్రువీకరణ పత్రం పొందే సౌలభ్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

మురళీనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ విజయోత్సవ కమిటీ అధ్వర్యంలో శనివారం శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని అయిదు ప్రాంతాల నుంచి ఈ ర్యాలీ మధ్యాహ్నం 2.30 గంటలకు ఆరంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. మాధవధార ఆర్‌అండ్‌బీ జంక్షన్ మారియట్ హోటల్, పెందుర్తి, గాజువాక, పాతపోస్టాఫీస్, ఆనందపురం ప్రాంతాల నుంచి యువత బైకు ర్యాలీగా బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ వద్దకు చేరుతారు. అక్కడ నుంచి సాయంత్రం 5 గంటలకు శోభాయాత్ర నిర్వహిస్తారు. పార్క్ హోటల్ నుంచి బీచ్ రోడ్డులోని కాళీమాత టెంపుల్ వరకు భారీ ఎత్తున ర్యాలీ చేపట్టేందుకు నిర్వహణ ఏర్పాట్లు చేపట్టారు. మాధవధార 50వ వార్డులో టీడీపీ కార్యాలయం నుంచి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు వరప్రసాద్ తెలిపారు.

బ్రహ్మకుమారీల దేశభక్తి ప్రశంసనీయం



దాదీ రతన్ మోహినీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రహ్మకుమారీలు

సీతమ్మధార, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి ప్రజాపిత బ్రహ్మకుమారీలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఏపీఈపీడీసీఎల్ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ ప్రసాద్ కొనియాడారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించేందుకు బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో సెమినార్‌ను, దాదీ రతన్ మోహినీ మృతికి సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదీ రతన్ మోహినీ చిత్రపటం వద్ద అతిథులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

సహజ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సహజ యోగ ధ్యాన ప్రచార యాత్రలో పాల్గొన్న సాధకులు

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సహజ యోగా, ధ్యానాన్ని రోజూ ఆచరించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని, శాంతిని పొందవచ్చని రాష్ట్ర కో-ఆర్డినేటర్ కల్లూరి రామకృష్ణ అన్నారు. మాతాజీ నిర్మలాదేవి సహజ యోగా ట్రస్టు ఆధ్వర్యంలో చైతన్య ప్రచార రథయాత్రను శుక్రవారం మహారాణిపేట, డాబాగార్డెన్స్, బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో నిర్వహించారు. జిల్లాలో ఈ నెల 28 వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. రీజనల్ కో-ఆర్డినేటర్ సుభాషిణి, స్వాతిప్రియ, శ్రీనివాసరావు, రమేష్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



గ్రామస్థులతో సంభాషిస్తున్న ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెంలో పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన జరిగింది. 1932లో నిర్మించిన స్వామివారి ఆలయం శిథిలం కావడంతో గ్రామ కమిటీ నూతన ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పాత ఆలయాన్ని తొలగించి కొత్త గుడి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ నిర్మాణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. చొక్కాకుల వెంకటరావు, విశ్వేశ్వరరావు ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయాన్ని అందిస్తామన్నారు. ఆగమ పండితులు శ్రీరామాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకుడు రామకృష్ణ శర్మ, భక్తులు, నిర్మాణ కమిటీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎక్కడ ఉన్నా క్రమశిక్షణ ముఖ్యం: ప్రిన్సిపాల్ మంజుల



ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో చివరి విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థినుల వీడ్కోలు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ ఉన్నత చదువులు లేదా ఉపాధి కార్యాలయాలలో చేరేవారు క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరే విధంగా ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. స్టూడెంట్స్ కన్వీనర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి మాట్లాడుతూ జీవితంలో మంచి స్థాయికి ఎదిగి కళాశాలకు మరింత ఖ్యాతిని తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు వివిధ వస్త్రధారణలతో సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరి అభినందనలు అందుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, స్టూడెంట్స్ కౌన్సిల్ మెంబర్లు డాక్టర్ కె.గీతాంజలి, బి.రాధమ్మ, పి.సాయితరుణి తదితరులు పాల్గొన్నారు.

దళారులుగా మార్కెటింగ్ శాఖాధికారులు

... 5వ పేజీ తరువాయి

రేటు పెరగకుండా స్థిరంగా ఉండేలా చూశామని, ఆ విషయం గుర్తించాలని చెబుతున్నారు.

రైతులకు నష్టాలు

రైతులు, డ్వాక్రా సంఘాలు హోల్‌సేల్‌లో టమాటా కొంటే వారికి క్రేటుకు రెండు కిలోలు తరుగు కింద ఇస్తారు. అధికారులు మాత్రం క్రేటు మొత్తానికి లెక్క కట్టి డబ్బులు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రైతు రోజుకు ఐదు క్రేట్ల టమాటా అమ్మితే పది కిలోల దగ్గర తరుగు కోల్పోతున్నాడు. అదికాకుండా రవాణా చార్జీలు అధికంగా ఉంటున్నాయి. అధికారులు ఇచ్చిన టమాటా అమ్మడం వల్ల రైతుల్లో దాదాపుగా 50 శాతం మందికి లాభం రాకపోగా చేతి డబ్బులు పడుతున్నాయి. ఈ విషయం ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. టమాటా వద్దని చెప్పినా బలవంతంగా అమ్మిస్తున్నారు. ఈ వ్యవహారం పూర్తిస్థాయిలో ఏడాది మొత్తం కొనసాగించడానికి ఇప్పుడున్న అధికారులు ప్లాన్ చేస్తున్నారు. బజార్లకు వచ్చే రైతుల వద్ద ఇంకా ఎన్ని రోజులు సొంత టమాటా (పండించినది) వస్తుందో ముందే అడిగి తెలుసుకొని లెక్కలేసుకుంటున్నారు. పైగా విశాఖపట్నంలో రైతులు దళారుల్లా మారిపోయారని, పంటలు పండించకుండా హోల్‌సేల్‌లో కొని ఎక్కువకు అమ్మి లాభపడుతున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ రైతుబజార్లను సందర్శించి తమ కష్టాలు తెలుసుకుంటే ఈ బాధలు ఉండవని, ఎవరు చెబుతున్నది నిజమో తెలుస్తుందని రైతులు అంటున్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

... 5వ పేజీ తరువాయి

అక్కడ మినహాయింపు ఇవ్వాలి. పద్మనాభం, భీమిలి మండలాల్లో గల 20 యూపీ పాఠశాలల రద్దును ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకించడంతో వాటిని కొనసాగించాలని నిర్ణయించారు. మరో మూడు యూపీ పాఠశాలలను రద్దు చేసి వాటిని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేయగా, ఆరు స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. నగరంలో బుచ్చిరాజుపాలెం, ముస్లింతాటిచెట్లపాలెం, డాబాగార్డెన్స్‌తోపాటు మరో మూడు యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మారుస్తున్నారు. తాజా నిర్ణయంతో ఉన్నత పాఠశాలల సంఖ్య 86 నుంచి 92కు పెరిగింది. అలాగే గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలలకు తరలించిన 3,4,5 తరగతులను వెనక్కి తీసుకువచ్చారు. కానీ 11 చోట్ల మాత్రం తరగతుల షిఫ్టింగ్‌ను తల్లిదండ్రులు వ్యతిరేకించారు. ఆ పదకొండుచోట్ల కూడా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం పిల్లల సంఖ్య 30కు అటుఇటుగా ఉండడంతో వాటిని అదే గ్రామంలో ఉన్న హైస్కూలులోనే కొనసాగిస్తారు. వీరి కోసం ప్రత్యేకించి బేసిక్ పాఠశాలలు ఏర్పాటు చేసి ఉన్నత పాఠశాలల టీచర్లతో బోధన అందిస్తారు.

ఒక్క పాఠశాల కూడా మూతపడదు

జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ముగిసింది. దీని ప్రకారం పాఠశాలలు 568కు పెరిగాయి. ఈ ప్రక్రియ కోసం పాఠశాల యాజమాన్య కమిటీల అభిప్రాయాలు తీసుకున్నాం. అందుకే ఇరవై చోట్ల యూపీ స్కూళ్లు కొనసాగించాలని నిర్ణయించాం. జిల్లాలో ఒక్క పాఠశాల కూడా మూతపడడం లేదు. తక్కువమంది పిల్లలున్నచోట్ల ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటుచేస్తున్నాం.

\- ఎన్.ప్రేమ్‌కుమార్, డీఈవో, విశాఖ

యథేచ్ఛగా ఆహార పదార్థాల కల్తీ

... 5వ పేజీ తరువాయి

క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అలాగే, దుకాణాల నుంచి సేకరించిన 22 నమూనాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించినట్టు తేలింది. అంటే అయోడిన్ సాల్ట్‌లో అయోడిన్ ఉండాలి. కానీ, లేకుండానే అయోడిన్ ఉన్నట్టు చెప్పి విక్రయాలు సాగిస్తారు. అలాగే, పప్పు, ఇతర పిండి పదార్థాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల పురుగులు పట్టడం జరుగుతుంది. వాటిల్లో కూడా నాణ్యత ఉండదు. అటువంటి 22 కేసులకు సంబంధించి ఇప్పటివరకూ 19 మంది వ్యాపారులకు జేసీ కోర్టులో జరిమానా విధించారు. ఆయా దుకాణాల నిర్వాహకులకు రూ.3.54 లక్షల జరిమానాను విధించారు. మరో 31 నమూనాల్లో కల్తీతోపాటు నాణ్యత ప్రమాణాలు తక్కువగా ఉన్నట్టు తేలింది. వీటిలో వివిధ రకాల కల్తీలు ఉన్నట్టు చెబుతున్నారు. మరో 40 నమూనాలకు సంబంధించిన ఫలితాలు రావాల్సి ఉందని చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

అన్నిరకాల ఆహార ఉత్పత్తులు, పదార్థాల్లో కల్తీ జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. వీలైనంత వరకు బయట ఆహారానికి దూరంగా ఉండడం ద్వారా కల్తీ కాటు నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

కర్నూలు, బెంగళూరు, తిరుపతికి ప్రత్యేక రైళ్లు

... 5వ పేజీ తరువాయి

ఉదయం 9.35 గంటలకు కర్నూలు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08546 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి వచ్చే నెల 28 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.10 గంటలకు కర్నూలులో బయలుదేరి మర్నాడు ఉదయం 8.00 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-బెంగళూరు-విశాఖ: 08581 నంబరు గల రైలు ఈనెల 13 నుంచి వచ్చే నెల 25 వరకూ ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08582 నంబరు గల రైలు ఈనెల 14 నుంచి వచ్చే నెల 26 వరకూ ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-తిరుపతి-విశాఖ: 08547 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి వచ్చే నెల 28 వరకూ ప్రతి బుధవారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08548 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి వచ్చే నెల 29 వరకూ ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరునాడు ఉదయం 11.30 గంటలకు విశాఖ చేరుతుంది.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 20 వినతులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 20 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, నిర్ణీత సమయంలోనే వచ్చిన ధరఖాస్తులను అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సీసీపీ ఆదేశించారు.

గురుకుల ప్రవేశ పరీక్ష రేపు

కొమ్మాది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఐదు, 11వ తరగతిలో ప్రవేశానికి 13న పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డి.శాంతకుమారి తెలిపారు. ఉదయం 10 నుంచి 12 వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు 11వ తరగతి ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.http:// apbragcet.apcfss.in నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్, ఆధార్‌కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో పరీక్షకు హాజరు కావాలన్నారు.జు

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచితశిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2 నెలలు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ ఇవ్వనున్నట్టు రామాటాకీస్ సమీపంలో గల సంస్థ కార్యాలయంలో ఏప్రిల్ 16 నుంచి జూన్ 16 వరకు శిక్షణ ఇస్తామని, మరిన్ని వివరాల కోసం ఫోన్ : 80193 88999లో సంప్రదించాలని కోరారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలో వేంచేసియున్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు,మధ్యాహ్నం స్వామివారి ప్రసాద వితరణ, నారాయణ సేవ కార్యక్రమంచేపట్టారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని స్వామి వారిని భక్తితో కొలిచారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కర శర్మలు ప్రత్యేక అభిషేకాలు చేపట్టి, తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం స్వామివారిని తిరువీధి మహోత్సవం జరిపి, రాత్రి పవళింపు సేవ, హరివరాసనంతో కార్యక్రమాలను ముగించారు. కార్యక్రమంలో గ్రామసేవా సంఘం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
- **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), తాతా(తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 28, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 22, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో)24, అల్లం (పాతది) 48, బరబాటి 20, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడ దుంపలు 36, కంద 52, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230


వెంకోజీపాలెం : ఇసుకతోటలోని బీసీ హాస్టల్ విదార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్


ఎంవీపీ కాలనీ : జ్యోతిరావు పూలేకు నివాళులు అర్పిస్తున్న వెలగపూడి ప్రతాప్, పలువురు టీడీపీ నేతలు

ఆదర్శప్రాయుడు జ్యోతిరావు పూలే

- జయంతి సందర్భంగా పలువురి నివాళి
- బీసీ హాస్టల్ విద్యార్థులతో కలెక్టర్ సహపంక్తి భోజనం

'మహాత్మా' జ్యోతిరావు పూలే జయంతిని పలు చోట్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేటి తరానికి పూలే ఆదర్శప్రాయులని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. మహిళా విద్య ప్రాధాన్యాన్ని జన బాహుళ్యంలోకి తెచ్చిన ఘనత జ్యోతిరావు పూలేకే దక్కుతుందన్నారు.

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఇసుకతోట బీసీ హాస్టల్ విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మహనీయుని స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక తీపి గుర్తుగా ఉండాలనే ఉద్దేశంతో విద్యార్థులతో కలిసి భోజనం చేసినట్టు కలెక్టర్ చెప్పారు. బీసీ వర్గాల అభ్యున్నతికి పేద ప్రజల సంక్షేమానికి జ్యోతిరావు పూలే విశేష సేవలు అందించారని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, సమాజ సేవలో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, చక్కగా చదువుకోవాలని హితవు పలికారు. ఏమైనా అవసరాలు ఉంటే బీసీ సంక్షేమ అధికారి శ్రీదేవి ద్వారా తన దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవితో పాటు హాస్టల్ వెల్ఫేర్ అధికారి నాగలక్ష్మి, సహాయక బీసీ వెల్ఫేర్‌అధికారి కృష్ణారావు, విద్యార్థులుపాల్గొన్నారు.

ఏయూలో..

వెంకోజీపాలెం : ఏయూలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ ప్రాంగణంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి వర్సిటీ వీసీ జీపీ రాజశేఖర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు, మహిళా విద్య, స్త్రీల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే దంపతులు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు , డీన్లు, ఇతర ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో..

ఎంవీపీ కాలనీ (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ పాల్గొన్నారు. టీడీపీ నాయకులు గాడి సత్యం, కాళ్ల శంకర్, నక్క కనకరాజు, బొట్ట వెంకటరమణ, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి అప్పారావు, శ్రీను, హిమయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

మద్దిలపాలెం (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే 'మహాత్మా' బిరుదు పొందిన తొలి వ్యక్తి జ్యోతిరావు పూలేనని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు పేర్కొన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాబురావు మాట్లాడుతూ సామాజిక అసమానతలను తొలగించడానికి ఎంతగానో కృషి చేసిన మహోన్నత వ్యక్తి పూలే అన్నారు. గొప్ప సామాజికవేత్త అయిన పూలే బడుగు బలహీనవర్గాలకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. పూలే ఆశయాలు జగన్ కొనసాగించారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, వైసీపీ నేతలు జహీర్ అహ్మద్, రవిరెడ్డి, మొల్లి అప్పారావు, పీతల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ఎస్కేఎల్ఎం నగర్ ఐదో సెక్టార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు పాల్గొనిజ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, నేతలు చిట్టూరి సత్యనారాయణ, సీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మద్దిలపాలెం : వైసీపీ కార్యాలయంలో పూలేకు నివాళులు అర్పిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు, పార్టీ నేతలు


వెంకోజీపాలెం : ఏయూలో పూలేకు నివాళు అర్పిస్తున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు, విద్యార్థులు


ఆరిలోవ : 12వ వార్డులో పూలేకు నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేత సత్యం తదితరులు

'విమ్స్' సేవలు ప్రశంసనీయం

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్


కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సత్కరిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, ఇతర వైద్యులు

ఆరిలోవ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందిస్తున్న కేజీహెచ్‌నకు ప్రత్యామ్నాయంగా విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్) సేవలు అందిస్తుండడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. విమ్స్ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ విమ్స్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందుతుండడంతో రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. దీనివల్ల కేజీహెచ్‌పై కొంత మేరకు ఒత్తిడి తగ్గిందన్నారు. ఇటీవల విమ్స్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయడం ద్వారా రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి ఆస్పత్రిగా రికార్డుకెక్కిందన్నారు. ఇటువంటి అరుదైన మరెన్నో ఘనతలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. జీవన్‌ధాన్ కార్యక్రమం అవగాహన కల్పించడంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు విశేష కృషి చేస్తున్నారని అభినందించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ.. విమ్స్‌లో అందిస్తున్న సేవలు గురించి వివరించారు. ఇక్కడ ఎప్పుడూ మెరుగైన వైద్య సేవలు అందించడానికి తమ సిబ్బంది కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ డాక్టర్ మాజీ వీసీ రవిరాజు, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున్, ఐవోసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే : ఆర్టీసీ ఆర్ఎం


మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాలకు ఆశాజ్యోతిగా మహాత్మా జ్యోతిరావు పూలే నిలిచారని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ద్వారకా బస్‌స్టేషన్ ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా విద్య కోసం ఆయన కృషి చేశారన్నారు. ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ దుర్గాప్రసాద్, అకౌంట్స్ ఆఫీసర్ వంశీమోహిని, అసిస్టెంట్ మేనేజర్ కమర్షియల్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో..

ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం రామ్మోహన్ భవన్‌లో జరిగిన జ్యోతీరావు పూలే జయంతి ఉత్సవాల్లో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైశ్రీనివాసరావు పాల్గొని జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యం

- బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పూర్ణచంద్రరావు

సిరిపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యమని మాజీ డీజీపీ, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త డా.జె.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది బీసీలున్నా అగ్రకులాల వారే రాజకీయాల్లో రాణిస్తున్నారన్నారు. రాజకీయ నేతలే ప్రజలకు అసలైన సమస్యగా మారిపోయారని విమర్శించారు. జ్యోతిబాపూలే 176 ఏళ్ల క్రితమే బీసీ సమస్యలపై పోరాడారన్నారు. ప్రభుత్వం కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ సిద్ధాంతాలను రాష్ట్రమంతా తెలియజేస్తామన్నారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో జనాభా ప్రాతిపదికన 52 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.శివప్రసాద్‌రావు, గౌతమ్‌కుమార్, కనకమహాలక్ష్మి, సురేశ్, సూరప్పడు, రమణయాదవ్, దేవిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో విభిన్న నైపుణ్యాలను పెంపొందించాలి

- ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ నాగరాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య నాగరాజకుమారి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఐఏఎస్ఈ, ఏయూ విద్యా విభాగంతో సంయుక్తంగా జాతీయ విద్యా విధానం 2020 - సహిత విద్యలో నూతన బోధన పద్ధతులు అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల పునరావాస విద్యా కార్యక్రమం (అధ్యాపకుల పునశ్చరణ తరగతులు)ను ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డి.నాగరాజకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజకుమారి మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారుల్లో విభిన్న నైపుణ్యాలను పెంపొందించే దిశగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. వివిధ శారీరక, మానసిక వైకల్యం కలిగిన దివ్యాంగ చిన్నారులు తమ జీవనం సాగించడానికి ఉపయుక్తంగా నిలిచే నైపుణ్యాలను వారిలో పెంపొందించడానికి అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రెండు రోజుల శిక్షణా తరగతుల్లో నిపుణులు అందించే సూచనలను ఆచరణలో చూపుతూ తమ బోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని అధ్యాపకులకుఆమె సూచించారు. సదస్సు కో-ఆర్డినేటర్, ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ చిన్నారుల కోసం వారిలో అవసరమైన బహుళ నైపుణ్యాలను పెంపొందించడానికి పలు సాంకేతిక ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రిహబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ-న్యూఢిల్లీ) పూర్వ సభ్యులు ఆర్.రంగనాథన్, డాక్టర్ ఎం.ప్రభాకరరావు, డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు. ఆర్‌సీఐ సభ్యత్వం కలిగిన 50 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు వృత్యాంతర శిక్షణ కోసం హాజరయ్యారు.

పలు చోట్ల చలివేంద్రాల ఏర్పాటు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పలు సేవా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు వాడవాడలా చలివేంద్రాలను శుక్రవారం ప్రారంభించాయి. ఎంవీపీ కాలనీ అళ్వార్‌దాస్ డిగ్రీ కళాశాల సమీప అళ్వార్‌దాస్ కూడలిలో అళ్వార్‌దాస్ విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ ఎస్‌వీహెచ్ రాజేంద్ర, డైరెక్టర్ రాహుల్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఏఎస్‌రాజా మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కాసు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అప్పారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొత్త వెంకోజీపాలెం సిగ్నల్ బస్టాండ్ వద్ద శ్రీసమర్థ సద్గురు సాయినాథ్ దేవాలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి బస్టాప్‌కు వచ్చిన వారికి, రోడ్డుపై వెళ్లే వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. రెండు నెలల పాటు ఈ చలివేంద్రాన్ని కొనసాగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. టీడీపీ నాయకులు కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు, కాళ్ల ఆనంద్, సూరిబాబు పాల్గొన్నారు

ఏయూలో 'భిన్నత్వంలో సమానత్వం'



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిరావుపూలే, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వారోత్సవాల సందర్భంగా 'భిన్నత్వంలో సమానత్వం' పేరిట మూవ్‌మెంట్ 21, జాతీయ సేవా పథకం యూనిట్-2, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల సంయుక్తంగా ఏయూలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు తొలుత ఏయూలో భిన్నత్వం సమానత్వం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ వేడుకల్లో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య పాల్గొని ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి సామాజిక విప్లవ యోధుడు జ్యోతిరావు పూలే అని, ఈ దేశంలో ఉన్న అసమాన కుల వ్యవస్థపై అలుపెరగని పోరాటం చేసి సమాజాన్ని విద్యతో మాత్రమే చైతన్య పరచగలమని, 1848లోనే మహిళలు, శూద్రులు, అతి శూద్రులకు రాత్రి పాఠశాలలను ప్రారంభించి సమాజాన్ని మేల్కొల్పారని, అలాగే గులాంగిరి దీనబంధు చెర్నాకోలా, స్వాజనీక సత్యదమ్మ వంటి పుస్తకాలను రాశారని కొనియాడారు. అంటరానితనం వంటి అసాంఘిక కార్యక్రమాలపై నిత్యం పోరాటం చేసి, ఈ దేశంలో మహిళలకు శూద్రులకు, అతిశూద్రులకు విద్యను అందించటానికి తన జీవితకాలం పోరాటం చేశారన్నారు. అనంతర కాలంలో బాబాసాహేబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అదే బాటలో జ్యోతిరావు పూలే ఆశయాలను తన ఆశయాలుగా మార్చుకుని, ఈ దేశంలో మెజారిటీ ప్రజలైన శూద్ర, అతిశూద్రు, మహిళలకు చదువుకునే హక్కు, ఓటు హక్కు, ఆస్తి హక్కును కల్పించేలా కృషి చేసి మనిషిగా జీవించే అవకాశం భారత రాజ్యాంగం ద్వారా చట్టబద్ధం చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మూవ్‌మెంట్ 21 జాతీయ బాధ్యత సభ్యులు డాక్టర్ మృత్యుంజయ, విద్యార్థి నాయకులు విజయ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీరులు కల్యాణ్‌వనం, సాయి, యోగి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో ఏయూ విద్యార్థికి బహుమతి


విద్యార్థి మహాలక్ష్మిని అభినందిస్తున్న ఆచార్యులు ఎ.నరసింహారావు, వానపల్లి వెంకట్రావు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న కర్ణాటక రాష్ట్ర ధార్వాడకు చెందిన సెంటర్ ఫర్ మల్టీ డిసిప్లినరీ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో ఏయూ తత్వశాస్త్ర విభాగానికి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థిని కోన మహాలక్ష్మి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. డైరెక్టర్ ఆచార్య బసవప్రభు జిర్లి చేతుల మీదుగా ధార్వాడలో విద్యార్థినికి రూ.7000, బహుమతితో పాటుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. 'భారతీయ పురాతన విజ్ఞానం - ప్రాతిపదికన ప్రాచీన సంప్రదాయాలు' సమకాలీన సమస్యలు అనే అంశంపై రాసిన వ్యాసానికి జాతీయ స్థాయి ద్వితీయ బహుమతిని పొందడం వర్సిటీకి ఎంతో గర్వకారణమని బహుమతి పొందిన విద్యార్థినిని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసించారు. కార్యక్రమంలో తత్వశాస్త్ర విభాగాధిపతి వానపల్లి వెంకట్రావు, డాక్టర్ వీరకుమార్ పాల్గొన్నారు.

సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్ బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడటంతో శుక్రవారం ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పనులు ప్రారంభించారు. మిగిలిన మూడు యూనిట్‌ల్లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

హనుమంతవాక జంక్షన్‌లో చలివేంద్రం ఏర్పాటు

ఆరిలోవ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌లో శుక్రవారం టీడీపీ సభ్యులు, ఆటోస్టాండ్ సభ్యులు సంయుక్తంగా చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 9వ వార్డు ఇన్‌చార్జి బుదుమూరు గోవింద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాపరుద్ర కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంటరీ కార్య నిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, విశాఖ పార్లమెంట్ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, తూర్పు ఐ.టీడీపీ ఇన్‌చార్జి బాదరు బాలరాజు, టీడీపీ 9వ వార్డు ప్రధాన కార్యదర్శి గెడ్డవలస వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే


బీజేపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


గ్రీన్‌పార్కు రోడ్డులో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


సీతమ్మధార ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద అధికారులు, ఉద్యోగులు

సీతమ్మధార, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే సంఘ సంస్కర్త, గొప్ప దేశభక్తుడని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు శ్లాఘించారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా సీతమ్మధారలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే దంపతులు సమాజంలో నిమ్నజాతులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి విశేష కృషిచేశారని పేర్కొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్) డి.చంద్రం పేర్కొన్నారు. సీతమ్మధారలోని సంస్థ కార్యాలయ ప్రాంగణంలో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి సంస్థ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, ఏజీఎంలు డి.సుమన్ కల్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రథమ సామాజిక కార్యకర్త

సీతంపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రథమ సామాజిక కార్యకర్త జ్యోతిరావు పూలే అని, ఆయన సమ సమాజ స్థాపనకు ఎంతో కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే చారిటబుల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. అఖిల భారత శరీర దాతల సంఘం వ్యవస్థాపకురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి రచించిన 'సావిత్రిబాయి మార్గంలో సీతామహాలక్ష్మి' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ వ్యాపారవేత్త, విజయ నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకులు విజయ్‌కుమార్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. నిరుపేద వైద్య, నర్సింగ్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేశారు. డాక్టర్ బండి సత్యనారాయణ, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఆర్.చంద్రశేఖర్, డాక్టర్ కె.ఎస్.మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నారా నాగేశ్వరరావు, మర్రివేముల శ్రీనివాస్, కోనూరు శ్రీనివాస్, శ్రీనివాస్ పట్నాయక్, పోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ ఘన నివాళులు

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు. గ్రీన్‌పార్కు రోడ్డులోని పూలే విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి పూలే చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆదర్శాలతో బలహీనవర్గాలకు సేవ చేయాలని కోరారు. పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కట్టడికి పోలీసు అధికారుల నిర్ణయం

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరం మీదుగా రైళ్లలో గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా కట్టడి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని విశాఖ నగర పోలీసు అధికారుల సమావేశంలో నిర్ణయించారు. శుక్రవారం పోలీసు సమావేశ మందిరంలో ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్, వివిధ విభాగాల డీసీపీలు, ఏసీపీలు, రైల్వేస్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల విభాగం పోలీసు అధికారులు సమావేశమై తాజా పరిస్థితిని సమీక్షించారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం ఇవ్వకుండా రైల్వే ఆస్తులు, భద్రతా స్టేషన్ వద్ద స్కానింగ్ మిషన్లు, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పొదలు తొలగించి విద్యుత్ సదుపాయం కల్పించడం, సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి కార్యాచరణతో గంజాయి రవాణాను అరికట్టి, రైల్వే ఆస్తుల పరిరక్షణను సమర్థంగా నిర్వహించాలని నిర్ణయించారు.

నేడు యథావిధిగా రిజిస్ట్రేషన్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు 12న రెండో శనివారం సెలవు అయినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయం పనిచేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియా ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని డీఐజీ బాలకృష్ణ తెలిపారు. తాము కూడా కార్యాలయంలోనే అందుబాటులో ఉంటామన్నారు.

కలెక్టరేట్‌లో మజ్జిగ కేంద్రం ప్రారంభం


సందర్శకురాలికి మజ్జిగ అందిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు శుక్రవారం ఉచిత మజ్జిగ కేంద్రాన్ని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా సందర్శకులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండ వేడిమి నుంచి ఉపశమనంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ కౌంటరును కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపంపై స్థానికుల ఆగ్రహం


వివేకానంద వీధిలో కాలువ నిర్మాణ పనులు

కంచరపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధిలోని వివేకానంద వీధి, శ్రీనగర్, సన్‌రైజ్ క్లబ్ ప్రాంతాల్లో కాలువలు, రోడ్ల నిర్మాణానికి మంజూరైన నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత లేకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వివేకానంద వీధిలో అచ్చిబాబు కల్యాణ మండపం నుంచి దిగువ రోడ్డు వరకు ఇరువైపులా కాలువ నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం కాలువ అడుగుభాగంలో పిక్క, సిమెంట్‌తో కూడిన కాంక్రీట్ వేయకుండా పనులు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పనులను బాధ్యులెవరూ పర్యవేక్షించకపోవడం గమనార్హం. మూడో పార్టీ తనిఖీ సిబ్బంది హాజరుకాకపోవడంపైనా సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతపై ప్రశ్నించాల్సిన స్థానిక ప్రజాప్రతినిధి కానరాకపోవడమేమిటని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి అందుబాటులో సౌకర్యం కేంద్రాలు

జ్ఞానాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆస్తి, ఖాళీ స్థలాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం రాయితీపై పన్ను చెల్లింపునకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నందున జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సౌకర్యం కేంద్రాలు శని, ఆది, సోమవారాలు కూడా పనిచేస్తాయని జోన్ అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 5 శాతం రిబేటుకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని ఇప్పటి వరకు జోన్‌లో రూ.4.3 కోట్లు వసూలైందని చెప్పారు. మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పించిన 50 శాతం వడ్డీ మాఫీ వెసులుబాటు ఏప్రిల్ 30 వరకు పొడిగించినందున బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉక్కు పరిశ్రమలో ఉద్యోగుల తొలగింపు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కొత్త పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పిస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌లో ఉద్యోగుల తొలగింపుపై స్పందించకుండా చోద్యం చూస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు విమర్శించారు. శుక్రవారం సిటు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల తొలగింపును సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడతామని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలల్లో సుమారు 3 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, 1,213 మంది శాశ్వత ఉద్యోగులను వీఆర్ఎస్‌తో ఇంటికి పంపారని, ఈ నిర్ణయం ఉక్కు ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలిగిస్తుందన్నారు. అనకాపల్లి జిల్లా డీఎల్‌పురం రాజీపేట, బోయపాడు, అమలాపురం, బంగారమ్మపేట, పెంటకోట గ్రామాల పక్కనున్న 2.9 కిమీ పొడవు సముద్ర ప్రాంతాన్ని ఆర్సిలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌కు కేటాయించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సముద్ర తీరాన్ని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే విధానం దేశ ప్రయోజనాలకు హానికరమని నర్సింగరావు అన్నారు. ఈ సమావేశంలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దళారులుగా మార్కెటింగ్ శాఖాధికారులు

... 5వ పేజీ తరువాయి

రేటు పెరగకుండా స్థిరంగా ఉండేలా చూశామని, ఆ విషయం గుర్తించాలని చెబుతున్నారు.

రైతులకు నష్టాలు

రైతులు, డ్వాక్రా సంఘాలు హోల్‌సేల్‌లో టమాటా కొంటే వారికి క్రేటుకు రెండు కిలోలు తరుగు కింద ఇస్తారు. అధికారులు మాత్రం క్రేటు మొత్తానికి లెక్క కట్టి డబ్బులు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రైతు రోజుకు ఐదు క్రేట్ల టమాటా అమ్మితే పది కిలోల దగ్గర తరుగు కోల్పోతున్నాడు. అదికాకుండా రవాణా చార్జీలు అధికంగా ఉంటున్నాయి. అధికారులు ఇచ్చిన టమాటా అమ్మడం వల్ల రైతుల్లో దాదాపుగా 50 శాతం మందికి లాభం రాకపోగా చేతి డబ్బులు పడుతున్నాయి. ఈ విషయం ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. టమాటా వద్దని చెప్పినా బలవంతంగా అమ్మిస్తున్నారు. ఈ వ్యవహారం పూర్తిస్థాయిలో ఏడాది మొత్తం కొనసాగించడానికి ఇప్పుడున్న అధికారులు ప్లాన్ చేస్తున్నారు. బజార్లకు వచ్చే రైతుల వద్ద ఇంకా ఎన్ని రోజులు సొంత టమాటా (పండించినది) వస్తుందో ముందే అడిగి తెలుసుకొని లెక్కలేసుకుంటున్నారు. పైగా విశాఖపట్నంలో రైతులు దళారుల్లా మారిపోయారని, పంటలు పండించకుండా హోల్‌సేల్‌లో కొని ఎక్కువకు అమ్మి లాభపడుతున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ రైతుబజార్లను సందర్శించి తమ కష్టాలు తెలుసుకుంటే ఈ బాధలు ఉండవని, ఎవరు చెబుతున్నది నిజమో తెలుస్తుందని రైతులు అంటున్నారు.

క్రికెట్ లీగ్ టోర్నీలో గీతం వర్సిటీపై సిటీ పోలీసు గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ వార్షిక లీగ్ టోర్నీలో భాగంగా శుక్రవారం గీతం యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో సిటీ పోలీసు 12 పరుగుల తేడాతో గీతం వర్సిటీపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీసు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 154 పరుగుల స్కోరు చేసింది. అనీష్ హాఫ్ సెంచరీ (62), విత్రినాథ్ (28) రాణించారు. గీతం బౌలర్ వెంకటరావు మూడు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో చివరి బంతి వరకు పోరాడిన గీతం యూనివర్సిటీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 142 పరుగులు చేసి ఓటమి చెందింది. అభిషేక్ (56), జాన్ రెజినాల్డ్ (51) అర్ధ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. సిటీ పోలీసు బౌలర్ ఎల్.శ్రీను మూడు వికెట్లు పడగొట్టాడు.

కేజీహెచ్‌లో జనన ధ్రువీకరణ పత్రాల జారీ


జనన ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, చిత్రంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ గైనకాలజీ వార్డులో జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రాన్ని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టిన ప్రతీ బిడ్డకు గుర్తింపు ఒక ప్రాథమిక హక్కు అని, దీనికి ముఖ్య ఆధారం జనన ధ్రువీకరణ పత్రమని తెలిపారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జనన ధ్రువీకరణ పత్రాల కోసం వివిధ కార్యాలయాలకు వెళ్లవలసి వచ్చేదని, ఇప్పుడు గైనకాలజీ విభాగంలోనే నూతన కేంద్రం ఏర్పాటు చేయటం ద్వారా తల్లి ఆధార్ కార్డుతో వస్తే కేవలం 24 గంటల్లోనే బిడ్డ జనన ధ్రువీకరణ పత్రం చేతికి అందుతుందని తెలిపారు. అంతేకాకుండా శిశువు నామకరణం తరువాత వస్తే పేరుజోడించి జనన ధ్రువీకరణ పత్రం పొందే సౌలభ్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

మురళీనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ విజయోత్సవ కమిటీ అధ్వర్యంలో శనివారం శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని అయిదు ప్రాంతాల నుంచి ఈ ర్యాలీ మధ్యాహ్నం 2.30 గంటలకు ఆరంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. మాధవధార ఆర్‌అండ్‌బీ జంక్షన్ మారియట్ హోటల్, పెందుర్తి, గాజువాక, పాతపోస్టాఫీస్, ఆనందపురం ప్రాంతాల నుంచి యువత బైకు ర్యాలీగా బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ వద్దకు చేరుతారు. అక్కడ నుంచి సాయంత్రం 5 గంటలకు శోభాయాత్ర నిర్వహిస్తారు. పార్క్ హోటల్ నుంచి బీచ్ రోడ్డులోని కాళీమాత టెంపుల్ వరకు భారీ ఎత్తున ర్యాలీ చేపట్టేందుకు నిర్వహణ ఏర్పాట్లు చేపట్టారు. మాధవధార 50వ వార్డులో టీడీపీ కార్యాలయం నుంచి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు వరప్రసాద్ తెలిపారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

... 5వ పేజీ తరువాయి

అక్కడ మినహాయింపు ఇవ్వాలి. పద్మనాభం, భీమిలి మండలాల్లో గల 20 యూపీ పాఠశాలల రద్దును ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకించడంతో వాటిని కొనసాగించాలని నిర్ణయించారు. మరో మూడు యూపీ పాఠశాలలను రద్దు చేసి వాటిని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేయగా, ఆరు స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. నగరంలో బుచ్చిరాజుపాలెం, ముస్లిం తాటిచెట్లపాలెం, డాబాగార్డెన్స్‌తోపాటు మరో మూడు యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మారుస్తున్నారు. తాజా నిర్ణయంతో ఉన్నత పాఠశాలల సంఖ్య 86 నుంచి 92కు పెరిగింది. అలాగే గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలలకు తరలించిన 3,4,5 తరగతులను వెనక్కి తీసుకువచ్చారు. కానీ 11 చోట్ల మాత్రం తరగతుల షిఫ్టింగ్‌ను తల్లిదండ్రులు వ్యతిరేకించారు. ఆ పదకొండుచోట్ల కూడా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం పిల్లల సంఖ్య 30కు అటుఇటుగా ఉండడంతో వాటిని అదే గ్రామంలో ఉన్న హైస్కూలులోనే కొనసాగిస్తారు. వీరి కోసం ప్రత్యేకించి బేసిక్ పాఠశాలలు ఏర్పాటు చేసి ఉన్నత పాఠశాలల టీచర్లతో బోధన అందిస్తారు.

ఒక్క పాఠశాల కూడా మూతపడదు

జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ముగిసింది. దీని ప్రకారం పాఠశాలలు 568కు పెరిగాయి. ఈ ప్రక్రియ కోసం పాఠశాల యాజమాన్య కమిటీల అభిప్రాయాలు తీసుకున్నాం. అందుకే ఇరవై చోట్ల యూపీ స్కూళ్లు కొనసాగించాలని నిర్ణయించాం. జిల్లాలో ఒక్క పాఠశాల కూడా మూతపడడం లేదు. తక్కువమంది పిల్లలున్నచోట్ల ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటుచేస్తున్నాం.

- ఎన్.ప్రేమ్‌కుమార్, డీఈవో, విశాఖ

ఐటీఐ పరీక్షలు రాయడానికి దరఖాస్తులకు ఆహ్వానం

కంచరపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రైవేటు, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల్లో పనిచేస్తూ ఐటీఐ ధ్రువపత్రాలు లేని వారికి ప్రైవేటు అభ్యర్థిగా ఐటీఐ పరీక్షలు రాసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. సంబంధిత ట్రేడ్‌లో అభ్యర్థులు మూడేళ్ల అనుభవంతో నైపుణ్యం ఉన్నట్టు సంబంధిత సంస్థ ధ్రువీకరించాలి. అభ్యర్థులు వారి అర్హతలతో పాటు ఎంప్లాయిమెంట్ కార్డు జతచేసి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో తమ దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. ఇందుకు ఈ నెల 12 వరకు గడువు ఉంది. ఐటీఐలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాస్ అయిన వారు, ఎస్‌సీవీటీ-2018 వరకు అడ్మిషన్ పొందినవారు, ఇతర అభ్యర్థులు ఎస్‌సీవీటీలో అడ్మిషన్ పొందినవారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. మరిన్ని వివరాలకు అభ్యర్థులు దగ్గరలో గల ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని శ్రీకాంత్ సూచించారు.

బ్రహ్మకుమారీల దేశభక్తి ప్రశంసనీయం


దాదీ రతన్ మోహినీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రహ్మకుమారీలు

సీతమ్మధార, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి ప్రజాపిత బ్రహ్మకుమారీలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఏపీఈపీడీసీఎల్ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ ప్రసాద్ కొనియాడారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించేందుకు బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో సెమినార్‌ను, దాదీ రతన్ మోహినీ మృతికి సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదీ రతన్ మోహినీ చిత్రపటం వద్ద అతిథులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

సహజ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


సహజ యోగ ధ్యాన ప్రచార యాత్రలో పాల్గొన్న సాధకులు

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సహజ యోగా, ధ్యానాన్ని రోజూ ఆచరించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని, శాంతిని పొందవచ్చని రాష్ట్ర కో-ఆర్డినేటర్ కల్లూరి రామకృష్ణ అన్నారు. మాతాజీ నిర్మలాదేవి సహజ యోగా ట్రస్టు ఆధ్వర్యంలో చైతన్య ప్రచార రథయాత్రను శుక్రవారం మహారాణిపేట, డాబాగార్డెన్స్, బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో నిర్వహించారు. జిల్లాలో ఈ నెల 28 వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. రీజనల్ కో-ఆర్డినేటర్ సుభాషిణి, స్వాతిప్రియ, శ్రీనివాసరావు, రమేష్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆహార పదార్థాల కల్తీ

... 5వ పేజీ తరువాయి

క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అలాగే, దుకాణాల నుంచి సేకరించిన 22 నమూనాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించినట్టు తేలింది. అంటే అయోడిన్ సాల్ట్‌లో అయోడిన్ ఉండాలి. కానీ, లేకుండానే అయోడిన్ ఉన్నట్టు చెప్పి విక్రయాలు సాగిస్తారు. అలాగే, పప్పు, ఇతర పిండి పదార్థాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల పురుగులు పట్టడం జరుగుతుంది. వాటిల్లో కూడా నాణ్యత ఉండదు. అటువంటి 22 కేసులకు సంబంధించి ఇప్పటివరకూ 19 మంది వ్యాపారులకు జేసీ కోర్టులో జరిమానా విధించారు. ఆయా దుకాణాల నిర్వాహకులకు రూ.3.54 లక్షల జరిమానాను విధించారు. మరో 31 నమూనాల్లో కల్తీతోపాటు నాణ్యత ప్రమాణాలు తక్కువగా ఉన్నట్టు తేలింది. వీటిలో వివిధ రకాల కల్తీలు ఉన్నట్టు చెబుతున్నారు. మరో 40 నమూనాలకు సంబంధించిన ఫలితాలు రావాల్సి ఉందని చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

అన్నిరకాల ఆహార ఉత్పత్తులు, పదార్థాల్లో కల్తీ జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. వీలైనంత వరకు బయట ఆహారానికి దూరంగా ఉండడం ద్వారా కల్తీ కాటు నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


గ్రామస్థులతో సంభాషిస్తున్న ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెంలో పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన జరిగింది. 1932లో నిర్మించిన స్వామివారి ఆలయం శిథిలం కావడంతో గ్రామ కమిటీ నూతన ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పాత ఆలయాన్ని తొలగించి కొత్త గుడి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ నిర్మాణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. చొక్కాకుల వెంకటరావు, విశ్వేశ్వరరావు ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయాన్ని అందిస్తామన్నారు. ఆగమ పండితులు శ్రీరామాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకుడు రామకృష్ణ శర్మ, భక్తులు, నిర్మాణ కమిటీ సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. గణేష్‌నగర్, సత్యసాయినగర్, నరసింహనగర్, రైతుబజారు ఏరియా, పోర్టు స్టేడియం వెనుక ఉన్న ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కర్నూలు, బెంగళూరు, తిరుపతికి ప్రత్యేక రైళ్లు

... 5వ పేజీ తరువాయి

ఉదయం 9.35 గంటలకు కర్నూలు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08546 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి వచ్చే నెల 28 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.10 గంటలకు కర్నూలులో బయలుదేరి మర్నాడు ఉదయం 8.00 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-బెంగళూరు-విశాఖ: 08581 నంబరు గల రైలు ఈనెల 13 నుంచి వచ్చే నెల 25 వరకూ ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08582 నంబరు గల రైలు ఈనెల 14 నుంచి వచ్చే నెల 26 వరకూ ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-తిరుపతి-విశాఖ: 08547 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి వచ్చే నెల 28 వరకూ ప్రతి బుధవారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08548 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి వచ్చే నెల 29 వరకూ ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరునాడు ఉదయం 11.30 గంటలకు విశాఖ చేరుతుంది.

అప్పన్న కల్యాణోత్సవాల్లో నేటి కార్యక్రమాలు

సింహాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై జరుగుతున్న వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపాక ఉదయం 6.30 నుంచి 8.00 వరకు పూర్ణాహుతి, మంగళాశాసనం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, తిరువీధి, అవభృథోత్సవం జరుగుతాయి. ఉదయం 8 నుంచి 11.30 వరకు భక్తులకు సర్వదర్శనాలు కల్పిస్తారు. మధ్యాహ్నం 11.30 నుంచి 12.30 వరకు రాజభోగం (మహా నివేదన). ఈ సమయంలో భక్తులకు దర్శనాలు నిలిపివేస్తారు. రాత్రి 7 నుంచి 11.00 వరకు ఆరాధన, నివేదన, మృగయోత్సవం, (అశ్వ వాహనంపై తిరువీధి), దొంగల దోపు ఉత్సవం, ధ్వజావరోహణం, సంవాద సేవ ఉంటుంది. అనంతరం పవళింపు, కవాట బంధనం చేస్తారు.

ఎక్కడ ఉన్నా క్రమశిక్షణ ముఖ్యం: ప్రిన్సిపాల్ మంజుల


ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో చివరి విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థినుల వీడ్కోలు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ ఉన్నత చదువులు లేదా ఉపాధి కార్యాలయాలలో చేరేవారు క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరే విధంగా ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. స్టూడెంట్స్ కన్వీనర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి మాట్లాడుతూ జీవితంలో మంచి స్థాయికి ఎదిగి కళాశాలకు మరింత ఖ్యాతిని తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు వివిధ వస్త్రధారణలతో సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరి అభినందనలు అందుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, స్టూడెంట్స్ కౌన్సిల్ మెంబర్లు డాక్టర్ కె.గీతాంజలి, బి.రాధమ్మ, పి.సాయితరుణి తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను నియంత్రించాలి : డీఈవో

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : హైస్కూళ్లలో డ్రాపౌట్స్ విద్యార్థులను తిరిగి బడిబాట పట్టేలా ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు బాధ్యతగా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్ పేర్కొన్నారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌ను శుక్రవారం డీఈవో ప్రేమ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా డ్రాపవుట్స్ అయి తిరిగి స్కూల్‌లో చేరేందుకు వచ్చిన పలువురు విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు.

వీధి లైట్లు ఏర్పాటుకు చర్యలు

గాజువాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గాజువాక జోనల్ పరిధిలోని పలు వార్డుల్లో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వార్డుకు 70 చొప్పున వీధి లైట్లు మంజురయ్యాయి.ఎక్కడైతే లైట్లు లేకపోవడం, మరమ్మతుకు గురయ్యాయో అక్కడ కొత్త లైట్లు ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. వీధిలైట్లు జోనల్ కార్యాలయానికి చేరుకున్నప్పటికీ లైట్లను స్తంభాలపై అమర్చేందుకు అవసరమైన క్లిప్స్ లేకపోవటంతో కొంత మేర జాప్యం జరిగింది. ఇప్పుడు అన్ని వస్తువులు సమకూరడంతో ప్రతి వార్డులో కొత్త లైట్లు ఏర్పాటు చేస్తున్నట్టు జోనల్ విద్యుత్ విభాగం అధికారులు తెలిపారు. గత రెండేళ్లగా వీధిలైట్లు లేక చాలా వరకు ప్రాంతాలు చీకటిమయంగా మారాయి.దీంతో ఆయా వార్డుల కార్పొరేటర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై కొంత మంది కార్పొరేటర్లు నిరసనకు సైతం దిగారు. కొత్తగా లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం స్టీల్‌ప్లాంట్ అయ్యప్ప స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటల నుంచి అష్టద్రవ్య గణపతి హోమం, తరువాత నెయ్యి అభిషేకం, అనంతరం స్వామి వారి విశేష అలంకరణ, తరువాత ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నృత్య ప్రదర్శన, అన్నసమారాధన చేశారు. జన్మదినోత్సవం సందర్భంగా పులి వాహనంపై స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

సినిమా గైడ్

- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
- **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 28, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 22, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది)48, బరబాటి 20, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోస కాయలు 24, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 44, పొట్లకాయ 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 36, కంద 52, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



ఉక్కు టౌన్‌షిప్ : విగ్రహావిష్కరణలు చేసిన అనంతరం మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ జీఎం పీఎస్ రావు



పెదగంట్యాడ : పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గీత, సహ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సీహెచ్ నాయుడు

జ్యోతిరావు పూలే సిద్ధాంతాలు అనుసరణీయం

» జయంతి సందర్భంగా పలువురి నివాళి » పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు

గాజువాక /ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గాజువాక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జ్యోతిరావు పూలె బాలికా విద్య ప్రాధాన్యాన్ని సమాజానికి తెలియజేసేలా చేశారని, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు అవిరళ కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ప్లాంట్ జీఎం పీఎస్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యకు వీరిరువురు ఇచ్చిన ప్రాధాన్యం నేటి సమాజానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ లైజన్ అధికారి ఉమామహేశ్వరరావు, అధ్యక్షుడు బి.అప్పారావు, కార్యదర్శి శ్రీనివాసరావు, కార్పొరేటర్ బి.గంగారావు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు బయ్యే మల్లయ్య, చంద్రరావు, కేఎస్ఎన్ రావు, రామస్వామి, కొమ్మినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస సీడబ్ల్యూసీ ప్రాంగణంలో జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కొలిపాక అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత జ్యోతిరావ్ పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్ర మంలో బి.సత్యనారాయణ, బుదిరెడ్డి అప్పారావు, బండారు చందూరమేశ్,గంతకోరు అప్పారావు, కరణం పైడిరాజు, రాము, కోసూరి తాతారావు, తదితరుల పాల్గొన్నారు. స్థానిక సత్రం జంక్షన్‌లో గల మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకల్లో సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల వారి హక్కుల కోసం పోరాటం సాగించిన యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని పారిశ్రామిక ప్రాంత గీత, సహ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వినాయక నగర్‌లోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూలె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వనిమి నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు నెల్లి సాధూరావు, చైర్మన్ బత్తిన పరదేశి, కార్యనిర్వాహక అధ్యక్షుడు పితాని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే స్టీల్‌ప్లాంట్ ఇంటక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నడుపూరులోని సంఘం కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతివేడుకలు నిర్వహించారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కె వంశీకృష్ణ పాల్గొని జ్యోతీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వీవీ నగేష్, కార్యవర్గం సభ్యులు అప్పారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడి : జ్యోతిరావ్ పూలేకు నివాళులర్పిస్తున్న పద్మశాలి సంక్షేమ సంఘం నేతలు

హనుమాన్ ర్యాలీకి ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వానం

గాజువాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గాజువాకలో శనివారం ప్రారంభం కానున్న హనుమాన్ శోభాయాత్ర ర్యాలీ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు గాజువాక బీజేపీ కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం గాజువాక పార్టీ కార్యాలయంలో ఆహ్వానపత్రం అందజేశారు. ఎంతో వైభవంగా ర్యాలీ చేపడుతున్నామని, ర్యాలీ గాజువాక వంటిల్లు జంక్షన్ వద్ద ప్రారంభం కానుందని తెలిపారు. ఆహ్వాన పత్రం అందజేసిన వారిలో గూటూరు శంకరరావు, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, గోవింద్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

గర్భిణుల ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న సూపరింటెండెంట్ భారతి, వైద్య సిబ్బంది

అగనంపూడి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక ఏరియా సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి సూచించారు. జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వైద్యులు, సిబ్బంది స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకంలో భాగంగా ప్రభుత్వం గర్భిణులకు అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా అందజేస్తోందన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాయామంతో పాటు తగినంత విశ్రాంతి అవసరమన్నారు. ఏదైనా అనారోగ్యంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఉష, గోపీకృష్ణ, ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, ఏవో రవిరాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

సినర్జీస్ కార్మికుల ఆందోళన

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలల బకాయి వేతనాలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని సినర్జీస్ కార్మికులు శుక్రవారం మెయిన్ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సినర్జీస్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ సినర్జీస్ కార్మికులకు యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సంస్థ ఉత్పత్తి కోసం నిరంతరం శ్రమిసున్నా.. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించపోవడం వల్ల వారంతా అర్థాకలితో కాలం గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బషీర్ దాస్, శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ,ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్ బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడటంతో శుక్రవారం ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పనులు ప్రారంభించారు. మిగిలిన మూడు యూనిట్‌ల్లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

స్వీయ రక్షణపై విద్యార్థినులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విజ్ఞాన్ విద్యార్థినులు

అగనంపూడి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యారినులకు స్వీయ రక్షణపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీవీజీ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ కె.శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో స్వీయ రక్షణపై విద్యార్థినులకు అవగాహన చాలా అవసరమన్నారు. విజ్ఞాన్ ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థినుల వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, సీహెచ్ శ్రీనివాస్, విరూపాక్ష, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగించకుండా చూడండి

» 'ఉక్కు' వ్యవహారంపై సీఎం చంద్రబాబుకు కార్పొరేటర్ గంగారావు లేఖ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని పేర్కొంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు శుక్రవారం లేఖ రాశారు. ఎన్నో ఏళ్లుగా స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఒక్కసారిగా విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం భారీ ప్యాకేజీ ఇచ్చిన కేంద్రం ఇప్పుడు సుమారు ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటుందని, దీనిపై కేంద్రంతో చర్చించి కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

యూజీడీ పనులు పరిశీలన



వేపగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 93వ వార్డు శ్రీనివాసానగర్ దరి సమతా కాలనీలో రూ. 47 లక్షల జీవీఎంసీ నిధులతో చేపడుతున్న యూజీడీ పనులను కార్పొరేటర్ రాపర్తి కన్నా శుక్రవారం పరిశీలించారు. కాలనీలో 30 ఏళ్లుగా మురుగు నీరు పోయేందుకు సరైన మార్గం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై వారు కార్పొరేటర్ కన్నాకు తెలియజేయడంతో ఆయన నిధులు మంజూరు చేయించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు కన్నా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజశేఖర్, ఇంజనీర్ వినయ్, కాంట్రాక్టర్ శివారెడ్డి, నక్కా అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బహిరంగ ధూమ పానం సేవించిన వారిపై జరిమానా

పెందుర్తి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి పోలీసుస్టేషన్ పరిధిలో బహిరంగంగా ధూమపానం సేవించిన వారికి జరిమానా విధించామని సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు 43 మందిపై కేసు నమోదు చేసి, రూ. 8,600 జరిమానా వసూలు చేశామని చెప్పారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

మల్కాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 58, 62 వార్డులకు చెందిన రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే గణబాబు శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, 58వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కొరాడ శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ పొత్తబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాల్లో వక్తలు

మల్కాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇవీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్, డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిబా పూలే జయంతి వేడుకల్లో ఆమె మాట్లాడారు. బాలికా విద్యకు, వారి సంక్షేమానికి పూలే ఎంతగానో కృషి చేశారన్నారు. మహిళల అభ్యున్నతిలో పూలే పాత్ర మరవరాని దని కొనియాడారు. అంతకముందు పలువురు పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి, అంజలి, సంధ్య, నదియా, శాంతి, త్రివేణి, గ్రంథాలయాధికారి శిరీష పాల్గొన్నారు. షిప్ యార్డులో ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనూ పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. మల్కాపురంలోని రాం-రాంజీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే చిత్రపటంతో పాటు అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు కూడా పూలమాలలు వేసి నివాళలర్పించారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనంగి వెంకట రమణి ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సోమునాయుడు, అనకాపల్లి జిల్లా యూత్ నాయకులు కొల్లు నాయుడు, గాజువాక నియోజకవర్గం నాయకులు సింహాచలం, ఉత్తరాంధ్ర జిల్లాల కల్చరల్ ప్రోగ్రామ్ ప్రతినిధి రాజేశ్వరి, బీసీ మహిళా నాయకులు మేల్లి రాజేశ్వరి, శ్రీదేవి పాల్గొన్నారు. అలాగే 59వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో వద్ద బీజేపీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్ర మంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ్, రాజు, దక్షిణామూర్తి, కవులూరు గురువులు, పోలిమేర హరిత, మద్దాల నాగలక్ష్మి, గుత్తుల సతీశ్ పాల్గొన్నారు.



షిప్ యార్డులో పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఈఎస్ఐ ఆస్పత్రిలో జనరేటర్ లేక అవస్థలు



గురువారం రాత్రి చీకట్లో ఉన్న ఆస్పత్రి

మల్కాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మల్కాపురంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి జనరేటర్ లేక పోవడంతో రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. గురువారం రాత్రి 11 గంటలకు ఆస్పత్రి ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ వైర్లు నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఇన్‌పేషంట్‌లతో పాటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇన్‌పేషంట్‌గా ఉన్న ఒకరు బయటకు వెళ్లిపోయారు. ఆ రోగి కోసం సిబ్బంది వెతికినా ఆచూకీ తెలియలేదు. శుక్రవారం ఉదయం ఆరు గంటల తరువాత విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేపట్టారు. ఆస్పత్రికి జనరేటర్ లేకపోవడంతో సరఫరా నిలిచిపోయిన వెంటనే చీకట్లు అలుముకుంటున్నాయి. భవిష్యత్తులో మళ్లీ ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

గోపాలపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీనుబాబు నగర్‌లో ఉన్న లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున 5 నుంచి స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. వైసీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రహదారి మూసివేతతో ఇబ్బందులు

ఉత్సవం నేపథ్యంలో నిర్వాహకులు ఆలయం ముందు ఉన్న రోడ్డును ఉదయం 6 గంటల నుంచి మూసివేశారు. గోపాలపట్నం దిగువ ప్రాంతంలో ఉన్న వేలాది మంది ఈ మార్గాన్ని వినియోగిస్తారు. రహదారి మూసివేయడంతో రైతుబజారుకు వచ్చేవారు, 30 పడకల ఆస్పత్రికి వెళ్లే రోగులు ప్రత్యామ్నాయ దారిలేక ప్రధాన రహదారిలో సర్వీస్ రోడ్డు నుంచి రాకపోకలు సాగించే ప్రయత్నం చేశారు. సర్వీస్ రోడ్డులో వన్ వేకు మాత్రమే పోలీసులు అనుమతించడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. చాలామంది పోలీసులతో వాగ్వాదానికి దిగినా ఫలితం లేకపోవడంతో సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం ప్రయాణించి గమ్యాన్ని చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆలయ నిర్వాహకులు రహదారిలో రాకపోకలు నిలిపివేస్తున్నట్టు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్టు తెలిసింది.



బీఆర్‌టీఎస్ సర్వీసు రోడ్డులో వాహనాలను అడ్డగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఇన్‌సెట్లో) లక్ష్మీగణపతి

సూర్యప్రభ వాహనంపై అప్పన్న

సింహాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి సూర్యప్రభ వాహనంపై శుక్రవారం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో పలు స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా తీర్చిదిద్ది సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేశారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనులు, పండితుల వేదమంత్రోచ్చారణలు, కళాకారుల కోలాటాల నడుమ మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా జరిపారు. కాగా ఉత్సవాల్లో భాగంగా హవనం నిర్వహించారు. సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు తరువాత యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ముందుగా సిద్ధం చేసిన మండపంలో అధిష్ఠింపజేసి, ఆగమోక్తముగా హవనాన్ని జరిపారు.



మాడవీధుల్లో స్వామివారి తిరువీధి ఉత్సవం



కల్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.


కళాకారుల నృత్యం




పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు


ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం


ఎదుర్కోలు దృశ్యం


సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు


జాతీయ రహదారి గురుద్వార కూడలిలోని బస్టాప్‌లో దీపాలు వెలగక పోవడంతో రోడ్డుపైకి చేరి నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అంధకారంలో బస్ బేలు


- భయంభయంగా నిరీక్షిస్తున్న మహిళలు
- చీకట్లో ఇక్కట్లు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పలుచోట్ల సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసిన బస్ బేలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రతిరోజూ సాయంత్రమయ్యే సరికి బస్టాప్‌లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంటాయి. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు సిటీ బస్సులనే ఆశ్రయిస్తారు. అయితే గత నెలరోజులుగా బస్ బేలలో దీపాలు వెలగకపోడంతో చీకట్లో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు బస్సుల కోసం వేచి ఉండేందుకు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ రహదారి పక్కన ఉన్న బస్టాపుల్లోనూ ఇదే దుస్థితి. దీంతో పలు రకాల చోరీలకు ఆస్కారం ఏర్పడుతోంది. అంతేకాకుండా బస్ బేల వద్దకు వేగంగా దూసుకువచ్చే బస్సులు, ఆటోలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందో తెలియని స్థితి నెలకొంది. చీకట్లు ఆలముకోవడంతో ఆకతాయిల బెడద తప్పడం లేదు. జాతీయ రహదారిపై అక్కయ్యపాలెం జంక్షన్‌లో రెండు, గురుద్వారా, ఎల్ఐసీ భవనం తదితర ప్రాంతాల్లోని బస్టాపులన్నీ చీకట్లోనే ఉన్నాయి. దీంతో మహిళలు బస్టాప్‌లలో కాకుండా రోడ్డుపైకి చేరి బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన బస్‌బేలో వెలగని లైట్లు


ఎల్ఐసీ కూడలిలోని బస్టాపువద్ద చీకట్లో ప్రయాణికులు


జాతీయ రహదారిపై అక్కయ్యపాలెం సౌత్ బస్ బే వద్ద చిమ్మ చీకట్లు

దాడి కేసులో బాలుడ్ని అరెస్టు చేసిన పోలీసులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనదారుడుపై దాడి చేసి ఫోన్ పే ద్వారా నగదు కాజేసిన బాలుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు శుక్రవారం గాజువాకలో క్రైం డీసీపీ కె.లతామాధురి వివరాలు వెల్లడించారు. రాజీవ్‌నగర్‌కి చెందిన ర్యాపిడో రైడర్ టి.కిశోర్ వాహనాన్ని ఆపి స్టీల్‌ప్లాంట్‌కు తీసుకువెళ్లాలని కోరిన బాలుడు అతడిపై దాడి చేసి ఫోన్ పే ద్వారా తన స్నేహితుడుకి రూ.48,100 పంపించుకున్నాడు. సాంకేతికత ద్వారా దర్యాప్తు చేసి నిందితుడ్ని గాజువాక బాబా ఆలయం వద్ద అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ లక్ష్మణరావు, సౌత్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. ఉషోదయ కూడలి సమీప శెట్టిబలిజ వీధికి చెందిన మహిళ మంగళవారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. రాత్రి 11 గంటలకు వచ్చారు. తలుపు గడియ విరగ్గొట్టి ఉండడంతో పోలీసులను ఆశ్రయించారు. రూ.15 వేల నగదు, పది గ్రాముల బంగారం పోయినట్టు గుర్తించారు. పోలీసుల విచారణలో అదే ఇంటి మేడపై ఉంటున్న కండిపల్లి హేమంత్(19) వీటిని చోరీ చేసినట్టు క్లూస్ టీం సహాయంతో గుర్తించి అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నిందితుడి నుంచి బంగారం, రూ.12 వేలు స్వాధీనం చేసుకున్నారు.

మరింతమంది కిలేడీ బాధితులు!

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ధనవంతురాలినని, తన డబ్బు రూ.వంద కోట్లు సీబీఐ చేతిలో చిక్కుకుందని, తక్కువ ధరకు స్థలాలు ఇస్తానంటూ దేవీరావు అనే మహిళ చేసిన మోసం కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేస్తున్నారు. భీమిలికి చెందిన అత్తిలి తరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఎంవీపీ పరిధిలో ఆమెకు సొమ్ము ఇచ్చామని మరో నలుగురు ముందుకు వచ్చారు. నిందితురాలిని విచారించగా మరింత మంది బాధితుల పేర్లు బయటకు వచ్చినట్టు తెలిసింది. బాధితుల్లో ఎక్కువమంది తగరపువలసకు చెందినవారేనని, అయితే ఫిర్యాదులు రాలేదని తెలిసింది. గతంలో ఈమెపై చెక్ బౌన్స్ కేసులు నమోదవడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

అంధుల వివాహ బంధం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ పుట్టుకతోనే అంధులు. వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు హైదరాబాద్‌లో కొంతకాలం కలిసి చదువుకున్నారు. అప్పట్లో పరిచయం... ఇప్పుడు పెళ్లిపీటలు ఎక్కిస్తోంది. విశాఖకు చెందిన బి.శివజ్యోతి పుట్టుకతోనే అంధురాలు. తల్లిదండ్రులను చిన్న వయసులోనే కోల్పోవడంతో ఇక్కడి వివేకానంద ట్రస్ట్ సిఫారసుతో ప్రేమ సమాజంలో ఆశ్రయం పొందింది. చిన జీయర్‌స్వామి ఆధ్వర్యంలో నడుస్తున్న అంధుల విద్యా సంస్థలో ఇంటర్‌వరకూ చదువుకున్న ఆమె, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తిచేసింది. అనంతపురం జిల్లా బుక్కపట్నం మండలం సిద్ధరాంపురం వాసి ఇనుముల రాఘవేంద్ర పుట్టుకతోనే అంధుడు. బీకాం కంప్యూటర్స్ పూర్తి చేసి కోయంబత్తూర్‌లోని పి.ఎఫ్.కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. రాఘవేంద్రకు, శివజ్యోతికి గతంలో హైదరాబాద్‌లోని వారిజ అంధ కళాశాలలో పరిచయమైంది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రేమ సమాజం అధ్యక్ష, ఉపాధ్యక్షులు బుద్ధ శివాజీ, మట్టపల్లి హనుమంతరావులకుతెలియజేయడంతో సంధానకర్తలుగా వ్యవహరిస్తూ రాఘవేంద్ర తల్లిదండ్రులను ఆహ్వానించారు. ప్రేమ సమాజం కార్యవర్గ సభ్యులు, రాఘవేంద్ర తల్లిదండ్రులు శుక్రవారం తాంబూలాలు మార్చుకున్నారు. ఇరువర్గాల ఆమోదంతో మే 10న ప్రేమ సమాజంలోని కంచర్ల అన్నపూర్ణాదేవి ఆడిటోరియంలో శివజ్యోతి, రాఘవేంద్రల పెళ్లి జరపాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కె.హరిమోహన్‌రావు, వివాహ కమిటీ సభ్యులు కోన జగదీశ్వరరావు, అప్పలరాజు, గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


కాబోయే వధూవరులు శివజ్యోతి, రాఘవేంద్ర

బేకరీలో అగ్నిప్రమాదం

పెదగంట్యాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గాజువాక కణితి రోడ్డు జగ్గు జంక్షన్‌లోని బెంగళూరు అయ్యంగార్ బేకరీలో గురువారం అర్ధరాత్రి ఒంటిగంటన్నర సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేశారు. అప్పటికే కొంత ఫర్నిచర్ దగ్ధమయింది. లీడింగ్ ఫైర్‌మన్ తారకేశ్వరరావు, ఐదుగురు ఫైర్‌మన్‌లు మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. రూ.5 లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకునినాలుగు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్ఐలు కేటీఆర్ లక్ష్మి, బీఆర్ బిశోయ్ ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీ చేస్తున్న సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్, అమిత్‌సింగ్ బగౌర్ గురువారం రాత్రి గంజాయి రవాణా చేస్తూ దొరికిపోయారని, వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని రైల్వే పోలీసు తెలిపారు.



పారిశ్రామిక, ఇంజనీరింగ్ ఎక్స్‌పో ప్రారంభం

- వేదిక బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామిక ప్రదర్శనల సంస్థ ఇండోర్ ఇన్ఫోలైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శుక్రవారం ఇండస్ట్రీయల్, ఇంజనీరింగ్ ఎక్స్‌పో ప్రారంభమయింది. ఈ నెల 13 వరకూ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్, వాసివా, ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ తదితర సంఘాల సహకారంతో ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు నిర్వాహక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్కే అగర్వాల్ పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి పదివేల మందికి పైగా సందర్శించనున్నారని అంచనా. ప్రదర్శనలో ఐదువేల యూనిట్ల వివిధ పారిశ్రామిక ఉత్పత్తులను ఉంచారు. అన్ని బ్రాండ్ల ద్వారా వచ్చే ఏడాదిలో రూ.50 కోట్ల విలువైన అమ్మకాలు నమోదు చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నై, ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, నాగ్‌పూర్ తదితర నగరాల నుంచి 50 మందికి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొని, లైజర్ కటింగ్, చేతి పనిముట్లు, మిషన్ టూల్స్, స్టీల్ ఉత్పత్తులు, ఆటోమేషన్, వెల్డింగ్, బేరింగ్స్, సైంటిఫిక్, ల్యాబ్ పరికరాలు, మెటీరియల్ హ్యాండ్లింగ్ ఉత్పత్తులు, భద్రత, నిర్వహణ, ఇంజనీరింగ్ ఉత్పత్తులు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది సరఫరాదారులు, తయారీదారులు, డీలర్లు, పంపిణీదారులు, స్టాకిస్టులు, ఇంటిగ్రేటర్ల మధ్య బి2బి సమావేశాన్ని నిర్వహించనున్నామన్నారు. దీనివల్ల నగరంలో కొత్త వ్యాపార అవకాశాల కల్పన ఉంటుందనే నమ్మకం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ఉదయం 11నుంచి రాత్రి 7 గంటల వరకూ ప్రదర్శన ఉంటుందని అగర్వాల్ తెలిపారు.


ఎక్స్‌పో ప్రారంభిస్తున్న అతిథులు

దక్షిణ కొరియా శిక్షణకు మత్స్య శాఖ జేడీ

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావును దక్షిణ కొరియాలో జరుగుతున్న శిక్షణకు పంపుతూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. మత్స్య శాఖకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించేందుకు అక్కడ 20 రోజుల శిక్షణ నిర్వహిస్తున్నారు. దీంతో ఈ నెల 10 నుంచి 30 వరకు ప్రభుత్వం ఆయనకు సెలవు మంజూరు చేసింది.

గొలుసు చోరీపై చురుగ్గా దర్యాప్తు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మంచినీళ్ల కావాలని అడిగి, మహిళ మెడలో గొలుసు తెంచుకుపోయిన కేసులో ఎంవీపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు ఇద్దరూ విజయవాడ వారిగా గుర్తించారు. వారు వినియోగించిన ద్విచక్ర వాహనం వదిలేయడంతో స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ నుంచి విశాఖ వరకూ బైక్‌పై వచ్చారా, మధ్యలో ఏమైనా నేరాలకు పాల్పడ్డారా అన్న కోణంలో విచారణ చేస్తు న్నారు. మధురవాడ స్టేషన్ పరిధిలో ఓ చైన్ స్నాచింగ్‌కు ప్రయత్నించినట్లు తెలిసింది. అది రోల్డ్‌గోల్డ్ కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించలేదని సమాచారం. నిందితులు ఎలాంటి గుర్తింపు పత్రాలు లేకుండానే ఓ లాడ్జిలో దిగినట్టు సమాచారం.

బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

మహారాణిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలు, మహిళాభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శ్లాఘించారు. గ్రీన్ పార్కు రోడ్డు వద్ద ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి ప్రారంభించారు. బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కల్పనకు 400 యూనిట్ల స్థాపనకు రూ.10.45 కోట్ల చెక్కును కలెక్టర్ అందజేశారు. పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు మధుసూదనరావు, రామ్మోహననాయుడు, ఎ.కృష్ణ, ఎం.రవికుమార్, జడ్పీ సీఈవో నారాయణమూర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


పూలేకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో...

మహారాణిపేట: జ్యోతిరావు పూలే జయంతిని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, నాయకులు టి.విజయ్‌కుమార్, అనసూరి మధు, సారిపల్లి మహేష్, విల్లూరి భాస్కరరావు, విల్లూరి చక్రవర్తి, కేదారి లక్ష్మి, మహ్మద్ గౌస్, ఉరుకూటి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

